Follow: @ANNTELUGU
16-05-2026

# మహా పత్రిక

ANN తెలుగు

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 139 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఏపీలో బంగారం గనులు

### ఈ ఏడాది 600 కిలోల ఉత్పత్తి

ఎంసిఏ ప్రారంభంలో చంద్రబాబు..

దేశానికి రక్షణశక్తిగా రాయలసీమ


**పుట్టపర్తి, మహా:** పుట్టపర్తి వేదికగా ఆంధ్రప్రదేశ్ రక్షణ రంగ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలోని ప్రతిష్టాత్మక 'అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్' ఇంటిగ్రేషన్ ఫ్లైట్ టెస్టింగ్ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఏపీని దేశానికే రక్షణ శక్తిగా అభివర్ణించడమే కాకుండా, రానున్న రోజుల్లో 'బంగారం' ఉత్పత్తిలోనూ రాష్ట్రం కీలక పాత్ర పోషించబోతోందని సంచలన ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగానే కాకుండా సహజ వనరుల వినియోగంలోనూ దూసుకుపోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గతంలో బంగారం అంటే కేజీఎఫ్ గుర్తుకు వచ్చేదని, కానీ ఇకపై జేజీఎఫ్ గుర్తుకు వస్తుందని

మిగతా 2లో

టాప్ న్యూస్

### నేను వేరు.. విజయ్ వేరు

- 2019లో ఒంటరిగా చేస్తే రెండు చోట్లా ఓడించారు
- పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు
- జై అమరావతి అంటే 33 వేల ఎకరాలే.. జై ఆంధ్ర అంటే 5 కోట్ల మంది
- ఆంధ్రాకు కులముంది కానీ సమైక్యత లేదు



02

### విజయ్ లాగే...

- నేనూ అధికారంలోకి వస్తా..
- టీఆర్ఎస్ చీఫ్ కవిత ధీమా




02

### ఫ్రెండ్లీ పోలీసింగ్ కాన్సెప్ట్ కరెక్టు కాదు

- టఫ్ పోలీసింగ్ చూపిస్తాం
- డబ్బు కోసం ఎవరూ పోలీస్ జాబ్ కు రాకండి
- డీజీపీ సీవీ ఆనంద్ సూచన



02



## భారీగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

### లీటర్‌కు రూ.3కు పైగా పెంపు

**హైదరాబాద్, మహా :** దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్‌పై రూ.3.42 పైసలు, డీజిల్‌పై రూ.3.26 పైసలు చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.తాజా పరిణామంతో హైదరాబాద్ లీటర్ పెట్రోల్ ధర రూ.110.88కు, డీజిల్ ధర రూ.98.96కి చేరింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో లీటర్ పెట్రోల్ ధర రూ.111.63, డీజిల్ రూ.96.36గా, విజయవాడాలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.53, డీజిల్ రూ.101.17గా ఉంది. అయితే, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల వల్ల సరఫరా గొలుసు దెబ్బతినవచ్చనే ఆందోళనల మధ్య అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు భారీగా పెరిగాయి. ఈ అదనపు భారాన్ని తగ్గించుకోవడానికి చమురు సంస్థలు ఈ ధరల పెంపును వినియోగదారులకు మోపాయి. కాగా పెట్రోభారంపై రాజకీయపక్షాలు మండిపడుతున్నాయి.



## విజయ్ బాటలో వీడీ

### విజయన్ ను కలిసి ఆశీస్సులు

**తిరువనంతపురం:** తమిళనాడు సీఎంగా ప్రమాణం స్వీకారం చేసిన టీవీకే చీఫ్ విజయ్ మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ను మర్యాదపూర్వకంగా కలవగా, ఇప్పుడు కేరళకు కాబోయే సీఎం వీడీ సతీశన్ కూడా అదే దారిలో నడిచాడు. అపద్ధర్మ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ను ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా విజయన్ వీడీ సతీషన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.



## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు కమిటీ

### కేకే సారథ్యం.. కమిటీలో కోదండరాం, పొన్నం

**హైదరాబాద్, మహా:** ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో ఎందరో వీరులు తమ ప్రాణాలను త్యాగం చేయగా, వేలాది మంది జైలు జీవితం గడిపారు. మరెందరో శారీరక వైకల్యానికి గురై నేటికీ ఆ వేదనను అనుభవిస్తున్నారు.

మిగతా 2లో

# రాహుల్ గాంధే ప్రధాని అభ్యర్థి..

# 2034 దాకా నేనే సీఎం



### ఆ తర్వాత కాంగ్రెస్‌కు అధికారం వచ్చినా.. నేను సీఎంగా ఉండను

2034 తర్వాత జాతీయ రాజకీయాల్లోకి వెళ్తా..

ఎవడు అడ్డుపడ్డా.. మూసీని ప్రక్షాళన చేసి తీరుతా..

డ్రగ్స్ ను అరికడతా.. ఇంకా కఠినంగా వ్యవహరిస్తాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా :**

వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని.. కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్టం చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని అన్నారు. గాంధీ కుటుంబానికి దేశంపై విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ దగ్గర తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా వే2న్యూస్ కాంక్లేవ్ లో సీఎం మాట్లాడారు. రాహుల్ ను కాంగ్రెస్ తరుపున ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి, ఏడాది ముందే కూటమిపార్టీలను రాహుల్ ప్రధానిగా ఒప్పిస్తామన్నారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు జనం స్విగ్గీ పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు.

**దేశానికి కూడా సేవలందిస్తా..**

ఇండియా కూటమి తరపున ఒక పాలసీ డాక్యుమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

మిగతా 2లో

### సోనియాగాంధీ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు

సోనియాగాంధీ లేకుంటే వెయ్యేళ్లయినా తెలంగాణ వచ్చేది కాదని సీఎం, అన్నారు. కాంగ్రెస్‌లో తాను చేరినప్పుడు అధికారంలో లేదని, అయినా చేరానని గుర్తుచేశారు. మనసుకు నచ్చినట్లే చేస్తా తప్ప అవకాశాల కోసం అవకాశవాదిగా మారనన్నారు. నిబద్ధతతో పార్టీలో చేరినందునే గాంధీ కుటుంబం తనకు అవకాశం ఇచ్చిందన్నారు. ప్రధానిగా మోదీ, ముఖ్యమంత్రిగా తాను అధికారిక కార్యక్రమంలో మాట్లాడుకున్నామని, గత ప్రభుత్వం కేంద్రంతో కయ్యం పెట్టుకున్నదన్నారు. నిధుల కోసం కలిసి రావాలటూ ప్రధాని అడిగారే తప్ప వ్యక్తిగతంగా కాదన్నారు. రాజకీయాల్లో తన కమిట్‌మెంట్ గురించి ప్రధానికి తెలుసన్నారు. మైక్‌ల ముందే మాట్లాడుకున్నాం తప్ప రహస్యం లేదన్నారు. ప్రధాని కామెంట్‌తో తనకున్న పొలిటికల్‌గా ఉన్న డిమాండ్ తేలిందన్నారు. తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవం ఇది అన్నారు.

### బండి సంజయ్ తన కొడుకుని అప్పగించాలి

- బండి భగీరథ్ పారిపోవడం తప్పన్న ముఖ్యమంత్రి
- బాధితులకు అండగా ఉంటామని స్పష్టం

వివరాలు 2లో

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

### జూన్ 2న ఆదిలాబాద్ నుంచి రెండో విడత ప్రారంభం

వరంగల్, ఖమ్మం జిల్లాల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**మహా వరంగల్ బ్యూరో;** ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మ గౌరవానికి, భవిష్యత్తు కు ప్రతీకని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిరంతరం కొనసాగించే ప్రక్రియగా చేపట్టిందన్నారు. గూడులేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర్చడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వని విధంగా ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో (వంద శాతం సబ్సిడీతో) పేదల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టి తెలంగాణా ప్రభుత్వం దేశానికి తలమానికంగా నిలిచిందన్నారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న



సమావేశాల్లో భాగంగా శుక్రవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు, హౌసింగ్ డిపార్ట్ మెంట్ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం ఇన్ ఛార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు దాసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పార్లమెంటు సభ్యులు వేం నరేందర్ రెడ్డి, పి.బలరాం నాయక్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరును విజయవంతంగా పూర్తి చేసి లక్షలాది పేద కుటుంబాల సొంత ఇంటి కలలను నెరవేర్చామని తెలిపారు.

మిగతా 2లో

### ఆస్తమా బాధితులకు శుభవార్త..

- చేప ప్రసాదం పంపిణీకి ముహూర్తం ఖరారు
- జూన్ 8 నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఏర్పాట్లు

వివరాలు 2లో



# రాహుల్ గాంధీ ప్రధాని అభ్యర్థి.. 2034 దాకా నేనే సీఎం

(మొదటిపేజీ తరువాయి)

2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు ప్రజలు అధికారం ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఇక్కడి ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

### అభివృద్ధి, సంక్షేమం నిరంతర ప్రక్రియ

జూబ్లీహిల్స్ నుంచి గ్రామాలకు వెళ్లిన తనకు రాజకీయాలతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఎలా ఉండాలో తెలుసన్నారు. గ్రామంలో పేద రైతులు, ప్రభుత్వ పాఠశాలల్లో చదవే విద్యార్థులు ఎలా ఉంటారో తెలుసని, ప్రభుత్వాలు మారినా పాలసీలు, పథకాలు కొనసాగాలన్నారు. రాష్ట్రంలో ప్రజలు, పార్టీలే శాశ్వతం తప్ప ప్రభుత్వాలు మారుతూ ఉంటాయన్నారు. అభివృద్ధి ఎప్పుడైనా దీర్ఘకాలిక దృష్టితో చేయాలని, అందుకే కాంగ్రెస్ పవర్‌లో ఉన్నప్పుడు ఔటర్ రింగ్ రోడ్డు, ఐటీఐఆర్ కారిడార్, మెట్రో రైల్.. ఇలాంటివన్నీ వచ్చాయన్నారు. సమస్యను ఎదుర్కొంటున్నప్పుడు మానసిక ఒత్తిడి ఉంటుందని, కానీ దాన్ని అధిగమించడానికి ఆలోచించుకోవాలన్నారు. ప్రజాప్రతినిధిగా ఆలోచనలో తనకు స్పష్టత ఉన్నదని, కొందరికి భిన్నాభిప్రాయాలు ఉన్నా అందరినీ మెప్పించలేమన్నారు.

### మూసీని ప్రక్షాళన చేసి తీరుతా

దాదాపు 17 ఏళ్ల పాటు ప్రతిపక్షంలోనే ఉన్న తనకు ప్రజా సమస్యలపైన అవగాహన ఉందన్నారు. ప్రపంచ దిగ్గజ సంస్థలను ఆహ్వానించి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించామని, తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగస్వాములను చేశామన్నారు. సుమారు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మించడంతో పాటు రాష్ట్ర మొత్తం అభివృద్ధికి అనుగుణంగా క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు భాగాలతో సమాన అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. కాలుష్య పరిశ్రమలను తరలిస్తున్నామన్నారు. చెరువులు, కుంటలు, నాలాలు, పబ్లిక్ పార్కులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటే ప్రకృతి క్షమించదన్నారు. “యుద్ధం జరిగినప్పుడు కొందరు అమాయకులు కూడా చనిపోతారు.. అది యుద్ధ నీతి.. ఆక్రమణలదారులకు ముందే నోటీసులు ఇస్తున్నాం.. ఏదీ నేను నా కోసం, నా ఇంటికి కోసం చేయడం లేదు.. ప్రజల కోసం చేస్తున్న.. కొన్ని తిట్లు భరిస్తా... చెరువులు ఆక్రమించుకున్నవారికి డబల్ బెడ్రూం ఇళ్లు ఇస్తున్నాం.. మూసీలో అక్రమంగా ఉంటున్నవారిని ప్రభుత్వం ఉదారంగా ఆదుకుంటుంది.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తాం.. విద్య, వైద్యం అందిస్తామని హామీ ఇచ్చాం.. ఎవరూ మూసీ మురికిలో ఉండాలని కోరుకోరు. మూసీని కట్టితీరుతా. ఎవరు అడ్డంపడ్డా ఆగదు” అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

### శంషాబాద్‌లో బుల్లెట్ ట్రెయిన్ హబ్

ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు మధ్యలో రేడియల్ రోడ్లు నిర్మిస్తున్నామని వివరించిన సీఎం.. కేంద్ర ప్రభుత్వం ఏడు బుల్లెట్ ట్రైన్లు ఇస్తే అందులో మూడు తెలంగాణకే తెచ్చుకున్నామన్నారు. శంషాబాద్ కేంద్రంగా బుల్లెట్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, రోడ్డు, ఎయిర్, నేవీ పోర్టు కనెక్టివిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రియల్ ఎస్టేట్ బాగున్నా తాను ఆశించినట్లు లేదన్నారు. ప్రపంచవ్యాప్తంగానే రకరకాల కారణాలతో గ్రోత్ తగ్గిందన్నారు. కొంతమంది సోషల్ మీడియాలో పెట్టుబడి పెట్టి వాళ్లే రాసి వాళ్లే చూసి వాళ్లే సంతోషిస్తున్నారని బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగారు. “వాళ్లు భ్రమల్లో ఉన్నారు.. నేను వాస్తవంలో ఉంటా.. ఊహాజనితమైన ప్రపంచంలో ఉండను.. వారసత్వంగా ముఖ్యమంత్రి పదవి వస్తుందని కొందరు కలలు కన్నారు.. ఇలాంటివి చాలా ఉదాహరణలున్నాయి..” అని అన్నారు.

### రాష్ట్ర, దేశ అభివృద్ధికి మహిళలు గ్రోత్ ఇంజన్

గత రెండు విద్యా సంవత్సరాల్లో ప్రభుత్వ స్కూల్స్‌లో జీరో డ్రాప్‌ఔట్స్ ఉన్నాయని, ప్రభుత్వ విద్యా వ్యవస్థను సంస్కరిస్తున్నామన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, స్కిల్ డెవలప్‌మెంట్.. ఇవన్నీ అందులో భాగమేనన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఇవ్వడం వల్ల విద్యార్థినులకు ఖర్చు లేకుండా చేశామని, రాష్ట్రంలోని సగం జనాభా ఉచితంగా ట్రావెల్ చేస్తున్నారని అన్నారు. ఈ స్కీమ్ వచ్చిన తర్వాత 28 నెలల్లో ఆర్టీసీకి రూ. 10 వేల కోట్లను రీఇంబర్స్ చేశామన్నారు. సగటున ప్రతీ మహిళ రూ. 10 వేలు ఆదా చేసుకున్నారన్నారు. ఆర్టీసీ దివాలా తీస్తుందని చాలా మంది అనుకున్నా లాభాల బాట పట్టించామన్నారు. ప్రతి నెలా ఆర్టీసీకి రూ. 350 కోట్లు చెల్లిస్తున్నామన్నారు. ఆదా అవుతున్న డబ్బుతో మహిళలు అనేక రకాలుగా లబ్ధిపొందుతున్నారని తెలిపారు. హైదరాబాద్ పరిధిలో డీజిల్ బస్సుల స్థానంలో ఈవీలను తెస్తున్నామన్నారు. ప్రతి నెలా ఆర్టీసీకి రూ. 2 వేల కోట్ల డీజిల్ ఖర్చును ఆదా చేస్తామన్నారు. మహిళలకు శక్తిని ఇస్తున్నామన్నారు.

### డ్రగ్స్ తల్చుకుంటేనే వణుకు పుట్టాలి

రాష్ట్రంలో డ్రగ్స్‌ను కంట్రోల్ చేయడానికి ‘ఈగల్ ఫోర్స్’ను తీసుకొచ్చామని, విద్యార్థులతో త్వరలో ప్రతిజ్ఞ చేయిస్తున్నామని సీఎం వివరించారు. ఫామ్ హౌజ్‌లలో పార్టీలు చేసుకుని దొరికిపోయినవారు ఇప్పుడు తనను విమర్శిస్తున్నారని తెలిపారు. దీపావళి రోజున చిచ్చుబుడ్లు కాల్చాలి కాని మందుబుడ్లు పెడతానంటే ఎలా అని ప్రశ్నించారు. గంజాయిని నియంత్రిస్తుంటే విమర్శిస్తూ విలన్‌గా చూస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగతంగా తాను 100 శాతం సంతృప్తితో ఉన్నానని, భవిష్యత్తు తరాల కోసం ఏదైనా చేయాలన్నదే తన ఆలోచన అని అన్నారు. మేడిగడ్డ నిర్మిస్తే మేడిపండులా కూలిపోయిందని, సగం జ్ఞానంతో చేస్తే ఇలాగే అవుతుందన్నారు. ఇప్పుడు తాను సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాని చెప్పారు. మానవ సంబంధాలు తెగిపోతున్నాయని, విలువలు పోతున్నాయని, వీటిని నిలబెట్టాల్సిన బాధ్యత పాలకుడిగా తనకున్నదన్నారు. రోజూ 18 గంటలు అధికారులతో సమీక్షలు చేస్తున్నానని గుర్తుచేశారు.

### సామాజిక బాధ్యతతోనే పదవులు

ముఖ్యమంత్రిగా వ్యవస్థలను పట్టాలెక్కించాల్సిన బాధ్యత తనపై ఉన్నదని, అందుకే ప్రతీ రెండు వారాలకు ఒకసారి ఒక సారి జిల్లా పర్యటనలకు వెళ్తున్నానని తెలిపారు. నిధుల సమీకరణ పైన ఎక్కువ సమయం కేటాయిస్తున్నానని తెలిపారు. జడ్పీటీసీగా ఉన్నప్పుడు ఏ ఇంట్లో ఉన్నానో ఇప్పుడు సీఎం స్థాయిలోనూ అదే ఇంట్లో ఉన్నానని గుర్తుచేశారు. కష్టపడ్డ నాయకులకే నామినేటెడ్ పోస్టులు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇంట్లో ఉండే వెడ్మ బొజ్జుకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి గెలిపించుకున్నామన్నారు. చాకలి ఐలమ్మ కుటుంబం, శ్రీకాంతాచారి కుటుంబం, కోదండరాం, ఆకునూరి మురళి.. ఇలా అందరినీ గుర్తు పెట్టుకుని పదవులు ఇచ్చామన్నారు. ‘జయ జయహే తెలంగాణ..’ గీతాన్ని రాష్ట్ర గీతం చేశామని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎవరు అడ్డువచ్చినా మూసీని ప్రక్షాళన చేసి తీరుతామన్నారు.

# బండి సంజయ్ తన కొడుకుని అప్పగించాలి

## బండి భగీరథ్ పారిపోవడం తప్పన్న ముఖ్యమంత్రి

## బాధితులకు అండగా ఉంటామని స్పష్టం

**హైదరాబాద్, మహా:** కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కిందిస్థాయి నుంచి పైకి వచ్చారని, కుమారుడి కారణంగా ఆయనకు తలవంపులు వచ్చాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసుపై ముఖ్యమంత్రి స్పందించారు. బండి భగీరథ్ పారిపోవడం తప్పని స్పష్టం చేశారు. బండి సంజయ్ బాధ్యత తీసుకుని తన కుమారుడిని పోలీసులకు అప్పగించాలని సూచించారు. అలా చేస్తే బండి సంజయ్ గౌరవం మరింత పెరుగుతుందని వ్యాఖ్యానించారు. ఎలాంటి కేసులనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని, పారిపోతే సమస్యలకు పరిష్కారం దొరకదని ఆయన అన్నారు. తప్పయినా, ఒప్పయినా మొదట నిలబడి సమాధానం చెప్పగలగాలని అన్నారు. తక్షణమే కుమారుడిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. ఈ కేసులో ఎవరిది తప్పో విచారణలో తేలుతుందని పేర్కొన్నారు.

**విచారణను ధైర్యం గా ఎదుర్కోవాలి**

మహిళలపైన నేరాలను ప్రభుత్వం నియంత్రించక తప్పదని, ఓ మైనర్ బాలిక తల్లి పేట్‌బషీరాబాద్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే నేర స్వభావం తీవ్రతకు అనుగుణంగా సెక్షన్లు కూడా మార్చి కేసు పెట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమ్మాయి స్టేట్‌మెంట్‌ను తీసుకుని వెంటనే నోటీసులు జారీ చేశామన్నారు. తొందరపడి ఉంటే 1000 మంది పోలీసులను తీసుకుని ఇంటి మీద పడ్డారని విమర్శలు చేసేవారన్నారు. సినిమా వాళ్లు, రాజకీయ నాయకులు.. ఎవరైనా మినహాయింపులు ఉండవన్నారు. పోక్సో కేసు పెట్టామంటేనే మహిళల భద్రత పట్ల తన కమిట్‌మెంట్ ఏమిటో తెలుసుకోవచ్చన్నారు. హోంమంత్రి గానే కాకుండా ముఖ్యమంత్రిగా చర్యలు తీసుకోవడం తన బాధ్యత అన్నారు. కుమారుడి విషయంలో బండి సంజయ్ తీరు నైతికంగా తప్పు అని సీఎం వ్యాఖ్యానించారు. “బండి సంజయ్ కేసు విచారణను ధైర్యంగా ఎదుర్కోవాలి.. కొడుకు తప్పిదం వల్ల తలవంపులు వచ్చాయి.. బండి సంజయ్ నిలబడి సమాధానం చెప్పాలి.. కొడుకును తీసుకువచ్చి స్టేషన్‌లో అప్పగించాలి..” అని అన్నారు

**బీఆర్ఎస్ రాజకీయంగా వాడుకుంటున్నది**

బండి సంజయ్‌కు, బీఆర్ఎస్ మధ్య ఎక్కడ చెడిందో తనకు తెలియదని, కానీ బండి సంజయ్ కుమారుడి విషయాన్ని మాత్రం రాజకీయంగా వాడుకునే ప్రయత్నం చేస్తున్నదని సీఎం ఆరోపించారు. బీఆర్ఎస్ విలీనాన్ని బండి సంజయ్ వ్యతిరేకించాడనే కోపముందేమోనన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇప్పుడు ఐపీఎస్ ఆఫీసర్ కాదని, ఫోక్సో కేసు పెడితే బెదిరించినట్లా లేక బాధితురాలి పక్షాన ఉన్నట్లా అని ప్రశ్నించారు. కేటీఆర్, బండి సంజయ్ మధ్య ఏమున్నదో తనకు తెలియదని, కానీ పిల్లల భవిష్యత్తుకు సంబంధించిన అంశంలో ఏ చిన్న తప్పు చేసినా పిల్లల జీవితాలు నాశనమవుతాయన్నారు. అమ్మాయికి రెండు బర్త్ సర్టిఫికెట్స్ ఉన్నాయని, వాటిని పోలీసులు విచారించాలి కదా అని అన్నారు. ఆలస్యం అయినా శిక్ష నుంచి మాత్రం తప్పించుకోలేరని స్పష్టం చేశారు. “నేను సత్రం నడపడం లేదు.. ప్రభుత్వాన్ని నడుపుతున్నా.. 100 శాతం బాధితులకు మా ప్రభుత్వం అండగా ఉంటుంది.. తప్పు చేసిన వారిని శిక్షిస్తాం.. నాలుగు నెలల ముందు జరిగిన ఘటనపై విచారించాలంటే సమయం పడుతుంది..” అని అన్నారు.

# ఆస్తమా బాధితులకు శుభవార్త

## 'చేప ప్రసాదం' పంపిణీకి ముహూర్తం ఖరారు

## జూన్ 8 నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఏర్పాట్లు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ నగరంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రక ఘట్టం, శ్వాసకోశ బాధితుల సంజీవని అయిన 'చేప ప్రసాదం' పంపిణీకి సర్వం సిద్ధమైంది. ప్రతి ఏటా మృగశిర కార్తె ప్రవేశాన్ని పురస్కరించుకుని బత్తిని కుటుంబీకులు అత్యంత నిష్ఠగా అందించే ఈ అరుదైన ప్రసాద పంపిణీకి ముహూర్తం ఖరారైంది. జూన్ 8వ తేదీ రాత్రి నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వేదికగా ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు బత్తిని కుటుంబ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. అబిడ్స్‌లో తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో బత్తిని గౌరీ శంకర్ గౌడ్, బత్తిని అమర్నాథ్ గౌడ్ పాల్గొని ఈ ఏడాది పంపిణీకి సంబంధించిన కీలక వివరాలను ప్రజలకు వెల్లడించారు. ఉబ్బసం, ఆస్తమా, దమ్ము, దగ్గు వంటి దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న లక్షలాది మందికి ఈ ప్రకటన ఎంతో ఊరటనిచ్చింది. గత 180 ఏళ్లుగా ఆస్తమా రోగుల పాలిట ఆశాకిరణంగా మారుతూ, బత్తిని కుటుంబ వంశస్థులు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఈ చేప ప్రసాదాన్ని ఉచితంగా అందిస్తూ వస్తున్నారు. జూన్ 8వ తేదీ రాత్రి సరిగ్గా 9 గంటలకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ పంపిణీ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభమై, 24 గంటల పాటు అంటే జూన్ 9వ తేదీ రాత్రి వరకు నిరంతరాయంగా కొనసాగుతుంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది వ్యాధిగ్రస్తులు ఒకట్రెండు రోజుల ముందుగానే ఇక్కడికి చేరుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సుదీర్ఘమైన వైద్య సేవను గుర్తిస్తూ అగర్వాల్ సమాజ ప్రతినిధులు బత్తిని కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా సన్మానించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఒకప్పుడు పాతబస్తీలో అత్యంత రద్దీ మధ్య జరిగే ఈ కార్యక్రమాన్ని, భద్రతా కారణాలు మరియు ప్రజల సౌకర్యార్థం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు మార్చిన విషయం తెలిసిందే.

ఈ పవిత్రమైన కార్యక్రమాన్ని ఆసరాగా చేసుకుని కొందరు మోసగాళ్లు ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని నిర్వాహకులు బత్తిని గౌరీ శంకర్ గౌడ్ తీవ్రంగా హెచ్చరించారు. క్యూలైన్లలో గంటల తరబడి నిలబడటం ఎందుకని భ్రమపెడుతూ, మాటల్లో పెట్టి చేప ప్రసాదాన్ని నేరుగా ఇంటికే డోర్ డెలివరీ చేస్తామని నమ్మించి కొందరు కేటుగాళ్లు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేప ప్రసాదం పంపిణీ అనేది స్వచ్ఛందంగా చేసే సేవ అని, ఇది పూర్తిగా ఉచితమని, దీనికి ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా ప్రసాదం పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే ఏమాత్రం ఉపేక్షించకుండా వెంటనే పోలీసులకు అప్పగించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే, చేప ప్రసాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పార్సిల్ చేసి పంపడం జరగదని, స్వయంగా వచ్చిన వారికి మాత్రమే మందును వేస్తామని తేల్చిచెప్పారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో 24 గంటల పాటు సాగే ఈ బృహత్తర కార్యక్రమంలో వివిధ కారణాల వల్ల పాల్గొనలేక, ప్రసాదం పొందలేకపోయిన వారు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని నిర్వాహకులు భరోసా ఇచ్చారు. పంపిణీ పూర్తయిన తర్వాత కూడా మరో మూడు, నాలుగు రోజుల పాటు కవాడిగూడలోని బత్తిని కుటుంబీకుల సొంత నివాసం వద్ద ఈ చేప ప్రసాదం అందుబాటులో ఉంటుందని వారు తెలిపారు. ఇంత భారీ ఎత్తున తరలివచ్చే లక్షలాది మంది ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జీహెచ్ఎంసీతో పాటు తెలంగాణ అగర్వాల్ సమాజ్ మరియు అనేక స్వచ్ఛంద సంస్థలు తమ వంతు బాధ్యతగా ముందుకు వస్తున్నాయి. ఇక్కడికి వచ్చే రోగులకు, వారి బంధువులకు పగలు, రాత్రి అనే తేడా లేకుండా అన్నదానం, మంచినీరు, మజ్జిగ, అల్పాహారం వంటి మౌలిక సదుపాయాలను ఉచితంగా అందించేందుకు ఆయా సంస్థలు ఏర్పాట్లు ముమ్మరం చేశాయి.

# ఫ్రెండ్లీ పోలీసింగ్ కాన్సెప్ట్ కరెక్టు కాదు




- టఫ్ పోలీసింగ్ చూపిస్తాం
- డబ్బు కోసం ఎవరూ పోలీస్ జాబ్ కు రాకండి
- డీజీపీ సీవీ ఆనంద్ సూచన

**హైదరాబాద్, మహా:** సమాజంలో శాంతిభద్రతలు సజావుగా ఉండాలంటే ఎఫెక్టివ్ పోలీసింగ్ అవసరమని, ఫ్రెండ్లీ పోలీసింగ్ కూడా అందులో భాగమేనని డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యానించారు. ‘ఫ్రెండ్లీ పోలీసింగ్ అనే కాన్సెప్ట్ నా దృష్టిలో కరెక్టు కాదు.. పోలీసింగ్ ఎప్పుడూ టఫ్‌గానే ఉండాలి.. సంఘ వ్యతిరేక శక్తులు, రౌడీ షీటర్లపై పోలీసులు కఠినంగానే ఉండాలి.. నేరస్తులు, నేర స్వభావం ఉండేవారు పోలీసులతో మర్యాదగా వ్యవహరించరు గదా.. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ ఓకే.. కానీ యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌తో ఆ కాన్సెప్ట్ అవసరం లేదు..’ అని డీజీపీ అన్నారు. పోలీసు డిపార్టుమెంటులో చేరాలని చాలామంది కోరుకుంటారని, పబ్లిక్ సర్వీస్ చేయాలనే ఆలోచన, కమిట్‌మెంట్, విజన్ ఉంటే ఫర్వాలేదన్నారు. కానీ ‘డబ్బు సంపాదన, పవర్, స్టేటస్ కోసమైతే చేరొద్దు.. మీకే చెడ్డపేరు వస్తుంది.. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. కరప్షన్‌కు అలవాటుపడితే ఏదో ఒక రోజు ఏసీబీ ట్రాప్‌లో చిక్కుకోక తప్పదు. సంపాదనే కావాలనుకుంటే పాన్ షాప్ పెట్టుకుని అయినా బతికేయొచ్చు..’ అని అన్నారు.

# విజయ్ లాగే నేనూ అధికారంలోకి వస్తా

## టీఆర్ఎస్ చీఫ్ కవిత ధీమా

**హైదరాబాద్, మహా:** తమిళనాడులో విజయ్‌లాగా తెలంగాణ రాష్ట్రంలో తానూ అధికారంలోకి వస్తానని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో తెలంగాణ రాష్ట్రంలో గుణాత్మక మార్పు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. శుక్రవారం ఆమె హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. తప్పుచేస్తే ఎంతపెద్దవారినైనా ప్రజలు వదిలిపెట్టరని బెంగాల్, తమిళనాడు ఫలితాలు చెబుతున్నాయన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసు రాజకీయకుట్రలో భాగమని వ్యాఖ్యానించారు. తనపై, తన రాజకీయ భవిష్యత్తుపై దాడి చేసేందుకు ఈ కేసును ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ప్రాంతీయ పార్టీలను బలహీనపరచేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని విమర్శించారు. తాను అనేక కఠిన పరిస్థితులను ఎదుర్కొన్నానని, ఆ అనుభవాలే తనను రాజకీయంగా మరింత బలంగా మార్చాయని కవిత తెలిపారు. రాజకీయంగా రేవంత్ రెడ్డి, బీజేపీకి మధ్య సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూనే కలిసి పనిచేస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. తాను రాజకీయాల్లో అవకాశాల కోసం రాలేదని, ప్రజల మన్ననలతోనే అధికారంలోకి రావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానని తెలిపారు. 2028 లేదా 2029 ఎన్నికల నాటికి తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చివరగా, తాను అబద్ధాలు చెప్పనని, నిజం మాత్రమే మాట్లాడతానని కవిత పేర్కొన్నారు. జీవిత అనుభవాలే తన ఆలోచనలను మార్చాయని, రాష్ట్ర ప్రజలకు మంచి చేయడమే తన తుది లక్ష్యమని కవిత స్పష్టం చేశారు. పోక్సో కేసుల విషయంలో బాధితులను కించపరచే విధంగా ప్రచారం చేయడం సరికాదని కవిత అన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు కమిటీ


(మొదటిపేజీ తరువాయి)



ఇన్నాళ్లూ కేవలం మాటలకే పరిమితమైన వారి గుర్తింపును, ఇప్పుడు చేతల్లో చూపిస్తూ రేవంత్ రెడ్డి సర్కార్ ఒక అధికారిక యంత్రాంగాన్ని సిద్ధం చేసింది. ఈ కీలకమైన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించడం కోసం ప్రభుత్వం ఒక అత్యున్నత స్థాయి కమిటీని నియమించింది. రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావు గారిని ఈ కమిటీకి చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో ఎమ్మెల్సీ కోదండరాం, మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ

(మొదటిపేజీ తరువాయి)



3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేయగా, దాదాపు 2.90 లక్షల వరకు గ్రౌండింగ్ కాగా, ఇందులో ఇప్పటికే సుమారు 50 వేల గృహ ప్రవేశాలు కూడా జరిగాయని, అలాగే మరో రెండు లక్షలకు పైగా ఇండ్ల నిర్మాణం పనులు వివిధ దశల్లో ఉన్నాయని మరో రెండు నెలల్లో పూర్తి అవుతాయని తెలిపారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేయగా, ఐటిడిఎ ప్రాంతాల్లోని నియోజకవర్గాలకు అదనంగా ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వచ్చే నెల రెండో తేదీన ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఇది ఇంతటితో ఆగిపోదని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వరకు మూడవ, నాలుగవ విడతలుగా ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇరవై వేల వరకు ప్రభుత్వం నుంచి సహాయం పొందిన వారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ పైలట్ గ్రామాల్లో ఆరువందలకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇండ్లను నిర్మించిన వారి బిల్లులను క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పేదవాడు తాను నివశిస్తున్న పూరి గుడిసె స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటే, తమ ల్యాండ్ అంటూ ఫారెస్ట్ అధికారులు గానీ, సింగరేణి యాజమాన్యం కానీ అడ్డుపడొద్దని చెప్పారు. ఇండ్ల బేస్ మెంట్ కోసం చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తే రెవెన్యూ, పోలీసు అడ్డు చెప్పకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి పేదల కోసం భూములను సేకరించి పట్టాలిచ్చారనీ, ఇందులో ఇంకా కొంత భూమి మిగిలే ఉందని దీనిని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, రెవెన్యూ విభాగానికి సంబంధించి క్షేత్ర స్థాయిలోని స్థితిగతుల పై ప్రజాప్రతినిధుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోడానికి, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించే చర్యలు తీసుకునే క్రమంలోనే సమావేశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధుల సూచనలకు అనుగుణంగా వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఇందిరమ్మ ఇండ్ల 2 విడత కార్యక్రమంలో అవసరమైన మార్పులు చేర్పులు చేస్తామన్నారు. ముఖ్యంగా ఈ నెలాఖరుకల్లా వివిధ నిర్మాణ దశల్లో ఉన్న రెండు పడకల ఇండ్లన్నిటికీ లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్ల పై ఉందన్నారు. ఈ విషయంలో ఎటువంటి రాజీ పడకుండా, పూర్తి పారదర్శకంగా అర్హులైన నిరుపేదలకే లబ్ధి చేకూరేలా చూడాలని స్పష్టం చేసారు. డబుల్ బెడ్ రూం కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలైన విద్యుత్, మంచినీరు, డ్రైనేజి వంటి వాటి పనులను వెంటనే పూర్తి చేయాలని, నిర్మాణంలో ఉన్న కాలనీల్లో టవర్ ను యూనిట్ గా తీసుకుని, లబ్ధిదారుల అసోసియేషన్ ల ద్వారా పనులు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను వీలైనంత వరకు సమీప ప్రాంతాల్లోనే అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ప్రధానంగా ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో అటవీభూములున్నాయని, రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాల మధ్య చాలా సరిహద్దు వివాదాలు ఉన్నాయని మంత్రి అన్నారు. రెండు విభాగాలు జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. దీంతో పాటు పట్టా భూములు, రెవెన్యూ, ఫారెస్టు మధ్య కూడా వివాదాలు ఉన్నాయని ప్రభుత్వం ఇటీవల కొనుగోలు చేసిన రోవర్స్ తో సర్వే నిర్వహించి భూ వివాదాలకు ముగింపు పలకాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంత్, వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్, బాజ్పాయి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏపీలో బంగారం గనులు



(మొదటిపేజీ తరువాయి)

ఆయన ధీమా వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలోని జొన్నగిరిలో ఈ ఏడాది 600 కేజీల బంగారం ఉత్పత్తి కానుందని, రెండో ఏడాది నాటికి అది 1500 కిలోలకు చేరుతుందని వివరించారు. భవిష్యత్తులో దేశంలోనే బంగారం ఉత్పత్తికి ఏపీ ప్రధాన చిరునామాగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. మరిన్ని కనుగొనండి భారతీయ పండుగలు తెలుగు కవిత్వం వార్త పోడ్‌కాస్ట్ తెలుగు సంగీతం వార్త బులెటిన్ పుట్టపర్తి నుంచి గగన గర్జన: AMCA ప్రాజెక్టు ప్రాధాన్యత దేశం గర్వించే వ్యూహాత్మక రక్షణ కేంద్రంగా పుట్టపర్తి రూపుదిద్దుకోబోతోందని సీఎం చంద్రబాబు అన్నారు. ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేసే ఎఎంసిఏ ప్రాజెక్టుతో 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో రానున్న ఈ ప్రాజెక్టు ద్వారా 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. కేవలం 36 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇచ్చి 'జెట్ స్పీడ్'తో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశామని ఆయన గుర్తు చేశారు.

# నేను వేరు.. విజయ్ వేరు

- 2019లో ఒంటరిగా చేస్తే రెండుచోట్లా ఓడించారు
- పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు
- జై అమరావతి అంటే 33 వేల ఎకరాలే.. జై ఆంధ్ర అంటే 5 కోట్ల మంది
- ఆంధ్రాకు కులముంది కానీ సమైక్యత లేదు




**అమరావతి, మహా:** పక్క రాష్ట్రంలో విజయ్ వంటి వారు ఒకరు పార్టీ పెట్టగానే గెలిచారని, నన్ను కూడా అలాగే చేసి ఉండాల్సిందని కొందరు అంటున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు రాజకీయ పరిస్థితులు, ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు పూర్తిగా భిన్నమైనవని ఆయన విశ్లేషించారు. అక్కడ ఉన్న రాజకీయ చైతన్యం వేరని, ఇక్కడ ఎదుర్కోవాల్సిన సవాళ్లు వేరని గుర్తు చేశారు. 2019 ఎన్నికల సమయంలో సింగిల్‌గా పోటీ చేస్తే ప్రజలు తనను రెండు చోట్లా ఓడించారని, ఆ సమయంలో పార్టీ నుంచి ఒక్కొక్కరుగా వెళ్లిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో కూడా ధైర్యం కోల్పోకుండా నిలబడ్డానని, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. రాజకీయం అంటే కేవలం అధికారం కాదని, పరాజయాలను జీర్ణించుకుని ప్రజాక్షేత్రంలో నిలబడటమే అసలైన విజమని ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాజధాని అంటే కేవలం 33 వేల ఎకరాల భూమి కాదు.. ఐదు కోట్ల మంది ప్రజల భవిష్యత్తు! అందుకే సంకుచిత భావాలను వీడి 'జై అమరావతి' అని కాదు.. 'జై ఆంధ్రా' అని గర్వంగా నినదిద్దాం!" అంటూ జనసేనాని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళగిరి వేదికగా ప్రకటించారు. 2019 నాటి ఓటమి చేదు జ్ఞాపకాలను గుండెల్లో దాచుకుని, ఒంటరి పోరులో నేర్చుకున్న గుణపాఠాలతో.. కేవలం 150 మందితో రగిలిన ఆశయం నేడు 21 లక్షల సైన్యంగా ఎలా విశ్వరూపం దాల్చిందో వివరిస్తూ ఆయన చేసిన ఉద్వేగభరిత ప్రసంగం అద్యంతం స్ఫూర్తిదాయకంగా సాగింది. తీవ్రమైన శారీరక నొప్పులను సైతం ఒక పోరాట యోధుడిలా చిరునవ్వుతో జయించి, రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న కులాల కుమ్ములాటలను చీల్చిచెండాడుతూ... సమైక్య, సరికొత్త ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే తన జీవిత అంతిమ లక్ష్యమని పవన్ కల్యాణ్ పూరించిన పవర్‌ఫుల్ శంఖారావం కోట్లాది మంది జనసైనికుల నవనాడులు ఉప్పొంగేలా చేస్తోంది. కేవలం 150 మంది సభ్యులతో అత్యంత సాధారణంగా ప్రారంభమైన ఈ పార్టీ, నేడు ఏకంగా 21 లక్షల సభ్యత్వాలను నమోదు చేసుకుని ఒక బలమైన రాజకీయ శక్తిగా అవతరించిందని ఆయన వివరించారు. ఎక్కడా రాజీ పడకుండా, విమర్శలను ఎదుర్కొంటూ, సుదీర్ఘకాలం ప్రజల్లో ఉంటూ నిర్మించుకున్న ఈ సంస్థాగత బలం రాబోయే కాలంలో మరిన్ని అద్భుతాలు సృష్టిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సంఖ్య అనేది కేవలం అంకె మాత్రమే కాదని, అది తనపై ప్రజలు ఉంచిన నమ్మకమని ఆయన వ్యాఖ్యానించారు.

**అనారోగ్యాన్ని జయించి..**

తన వ్యక్తిగత ఆరోగ్యంపై వస్తున్న వార్తలకు పవన్ కల్యాణ్ ఈ వేదికగా తెరదించారు. గత కొంతకాలంగా సైనస్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడ్డానని, అంతేకాకుండా భుజం మధ్యలో ఒక చిన్న కండ తెగి నొప్పి వేధించిందని ఆయన వెల్లడించారు. అయితే, చిన్నతనం నుంచి తాను తీసుకున్న స్పోర్ట్స్ ట్రైనింగ్ మరియు క్రమశిక్షణ వల్ల ఎంతటి శారీరక నొప్పినైనా తట్టుకోగలనని, ప్రస్తుతం తన ఆరోగ్యం నిలకడగా ఉందని స్పష్టం చేశారు. నాయకుడికి ఉండాల్సిన సహనం, ఓర్పు తనకు క్రీడల ద్వారా అబ్బాయని, శారీరక ఇబ్బందులు తన ప్రజా సేవకు ఎప్పుడూ అడ్డు కావని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**జై ఆంధ్ర నినాదమే మిన్న**

"జై అమరావతి" అనే నినాదం విన్నప్పుడు తన మనసుకు బాధ కలుగుతుందని ఆయన సంచలన వ్యాఖ్య చేశారు. జై అమరావతి అంటే అది కేవలం 33 వేల ఎకరాలకే పరిమితం అవుతుందని, అదే "జై ఆంధ్ర" అంటే అది రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలకు చేరుతుందని ఆయన వివరించారు. రాజధాని అనేది కేవలం ఒక ప్రాంతం కాదని, అది మొత్తం రాష్ట్ర అభివృద్ధికి చిహ్నమని, అందుకే సంకుచిత భావాలను వీడి విశాల దృక్పథంతో "జై ఆంధ్ర" అని నినదించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్ర రాష్ట్రంలో కులం ఉన్నంతగా సమైక్యత లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు కులాల వారీగా విడిపోవడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, అభివృద్ధి కుంటుపడుతోందని విశ్లేషించారు. కులాలకు అతీతంగా అందరూ ఒక్కతాటిపైకి వచ్చినప్పుడే రాష్ట్రం నిజమైన పురోగతి సాధిస్తుందని, జనసేన పార్టీ ఎప్పుడూ కుల రాజకీయాలకు వ్యతిరేకమని ఆయన స్పష్టం చేశారు. ఐక్యమత్యమే మహాబలమనే సూత్రాన్ని అందరూ పాటించాలని ఆయన కోరారు. రాజధాని రైతుల త్యాగాలను తాను గౌరవిస్తానని చెబుతూనే, తన పోరాటం ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తు కోసమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అమరావతిని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో, రాష్ట్రంలోని ప్రతి జిల్లాను, ప్రతి పేదవాడిని అభివృద్ధి చేయడం అంతే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. కేవలం ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో తాను పరిమితం కాలేనని, తన దృష్టి ఎప్పుడూ రాష్ట్రం మొత్తం మీద ఉంటుందని చెప్పారు. పాలకుడిగా తన బాధ్యత అందరినీ సమానంగా చూడటమేనని, ఆ దిశగానే తన అడుగులు పడుతున్నాయని ఆయన వివరించారు.

**స్ఫూర్తిదాయక ప్రసంగం**

దాదాపు గంటకు పైగా సాగిన పవన్ కల్యాణ్ ప్రసంగం కార్యకర్తల్లో కొత్త రక్తాన్ని నింపింది. ఆయన మాటల్లోని నిజాయితీ, లక్ష్యం పట్ల ఉన్న స్పష్టత అందరినీ ఆకట్టుకున్నాయి. కేవలం భావోద్వేగాలకు లోనుకాకుండా, వాస్తవ పరిస్థితులను వివరిస్తూ ఆయన మాట్లాడిన తీరు ఒక పరిణతి చెందిన నాయకుడిని తలపించింది. సభ ముగిసిన తర్వాత కూడా కార్యకర్తలు "జై ఆంధ్ర" అంటూ నినదిస్తూ మంగళగిరి వీధుల్లో ఉత్సాహంగా కనిపించారు. ఈ సమావేశం జనసేన పార్టీలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి


- గోవుల అక్రమ రవాణాను నియంత్రించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**మహా వరంగల్ బ్యూరో;** పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న పోలీస్ చెక్ పోస్టుల్లో సిబ్బంది తప్పని సరిగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి వుంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. గోవులతో పాటు మూగ జీవాల అక్రమ రవాణా నియంత్రణ చేసేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సరిహద్దుల్లో ప్రత్యేకంగా పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చెక్ పోస్టుల్లో సిబ్బంది పని తీరును పరిశీలించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కటాక్షపూర్ పోలీస్ చెక్‌పోస్ట్‌ను అకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీ భాగంగా ముందుగా పోలీస్ కమిషనర్ చెక్‌పోస్ట్ వద్ద ఎర్పాటు చేసిన బారీకేడ్లను పరిశీలించడంతో పాటు, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపి ఈ చెక్‌పోస్ట్‌లో రికార్డుల నిర్వహణ, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకోని చెక్‌పోస్ట్‌లో సిబ్బంది కోసం ఎయిర్ కూలర్, మంచినీటి ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ తనిఖీ చేసారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ చెక్‌పోస్ట్ సిబ్బంది పలు సూచనలు చేస్తూ పోలీస్ సిబ్బంది నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, ముఖ్యంగా ఇక్కడ నియమించబడిన సిబ్బందిలో సగం మంది తనిఖీ నిర్వహించాలని, మరో సగం మంది విశ్రాంతి తీసుకోవాల్సి వుంటుందని. ముఖ్యంగా ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేయాలని, కంటైనర్లను సైతం తనిఖీ చేయాల్సి వుంటుందని. విధి నిర్వహణలో చెక్‌పోస్ట్ సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ వెంట ఆత్మకూర్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ వున్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

- చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు
- ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్



**మహా వరంగల్ బ్యూరో ;** వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాలతో మామూనూర్ డివిజనల్ పోలీసుల ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం మామూనూర్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఈస్ట్ జోన్ డీసీపీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ తనదైన శైలిలో రౌడీ షీటర్లను హెచ్చరిస్తూనే ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు నేరప్రవర్తన కలిగిన వ్యక్తులు చట్టబద్ధంగా, సమాజానికి హాని కలగకుండా ప్రవర్తించాలని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, కబ్జాలు, గొడవలు, బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా చట్టాలను గౌరవిస్తూ పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, అనుమానాస్పద కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే పనులు, మద్యం, జూదం, అక్రమ వసూళ్లు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనరాదని స్పష్టం చేశారు. తమ పరిసరాల్లో ఎటువంటి నేర సంఘటన జరిగినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాజంలో మంచిగా జీవిస్తూ ఉపాధి పొందేందుకు ప్రయత్నించాలని, ఫోన్ నంబర్, చిరునామా లేదా ఇతర వ్యక్తిగత వివరాల్లో మార్పులు వచ్చినప్పుడు వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. రౌడీ షీటర్లు తమ ప్రవర్తన మార్చుకుని చట్టానికి లోబడి జీవిస్తే సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించుకోవచ్చని, లేకపోతే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని డీసీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మామూనూర్ ఏసీపీ వెంకటేష్, మామూనూర్, గీసుగొండ, ఏనుమాముల ఇన్స్ స్పెక్టర్లు శ్రీనివాస్ యాదవ్, డి. విశ్వేశ్వర్, సురేష్ సంగెం ఎస్.ఐ వంశీ కృష్ణ పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ తల్లికి గుండెపోటు



**కరీంనగర్ మహా :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తల్లి శకుంతల గుండెపోటుకు గురయ్యారు. కరీంనగర్ లోని తమ నివాసంలో ఉన్న ఆవిడకు గుండెనొప్పి రావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వెంటనే హైదరాబాద్ కు తరలించగా గచ్చిబౌలిలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. శకుంతలకు గుండెకు స్టంట్ వేసిన వైద్యులు అత్యవసర చికిత్స సేవలు అందిస్తున్నారు. సమాచారం అందుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ మెడికవర్ ఆసుపత్రికి చేరుకొని అమ్మ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. శకుంతలకు నలుగురు సంతానం కాగా ముగ్గురు కొడుకులు ఒక కూతురు ఉన్నారు. అందులో బండి సంజయ్ అందరికంటే చిన్నవాడు.

## బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

### సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

CPI ML మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ డిమాండ్







**గోదావరిఖని ఎన్ టి పి సి :** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు పోక్సో కేసు నమోదైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని CPI ML మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్.టి.పి.సి మేడిపల్లి సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జూపాక శ్రీనివాస్ మరియు పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేష్ మాట్లాడుతూ.హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 8వ తేదీన బండి భగీరథపై పోక్సో కేసు నమోదై వారం గడుస్తున్నా, పోలీసులు ఇప్పటి వరకు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. కేంద్రంలోని అధికార బలంతో నిందితుడిని తప్పించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు సాక్షాత్తు కేంద్ర హోంశాఖలో కీలక పదవిలో ఉన్న బండి సంజయ్, తన కుమారుడిపై ఇటువంటి తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాల్సింది పోయి.దీనిని రాజకీయ కుట్రగా అభివర్ణించడం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు.గతంలో కూడా బండి భగీరథ కాలేజీలో విద్యార్థులపై భౌతిక దాడులు, ర్యాగింగ్‌కు పాల్పడిన చరిత్ర ఉందని, ఇప్పుడు ఏకంగా మైనర్ బాలికకు డ్రగ్స్ ఇచ్చి అత్యాచారం చేయడం పరాకాష్ట అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అంతర్గాం మండల కార్యదర్శి గుమ్మడి వెంకన్న, TUCI జిల్లా కార్యదర్శి ఈసంపల్లి రాజేందర్, నాయకులు చంద్రయ్య,శంకర్,రాయమల్లు, నాగభూషణం,చిలక రాజు,రాజయ్య,క్రాంతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ఒప్పంద కార్మికుల నియామకాల దరఖాస్తుల పరిశీలన

### బల్దియా అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్



**మహా వరంగల్ బ్యూరో;** గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని ఒప్పంద కార్మికుల కారుణ్య నియామకాల కమిటీ సమావేశం అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ అధ్యక్షతన బల్దియా ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించబడింది.ఈ సందర్భంగా కారుణ్య నియామకాల కోసం వచ్చిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. మొత్తం 42 దరఖాస్తులను పరిశీలించగా, అందులో 34 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన దరఖాస్తులు వివిధ కారణాల వల్ల తిరస్కరించబడినట్లు వెల్లడించారు.అర్హులైన అభ్యర్థుల వివరాలను సంబంధిత నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తిసుకొనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, సీహెచ్‌వో రమేష్, ఈఈ మహేందర్, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, హెచ్ ఓ లాక్ష్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో..
## అశోక్ నగర్‌లో విస్తృత తనిఖీలు

- 80 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు స్వాధీనం
- మూడు బెల్ట్ షాపులపై కేసులు నమోదు
- మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పారిశ్రామిక ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, ప్రజల్లో భద్రతా అవగాహన కల్పించడం లక్ష్యంగా పోలీసులు శుక్రవారం నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 80 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలను స్వాధీనం చేసుకుని, మూడు బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. మణుగూరు అశోక్‌నగర్ ప్రాంతంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐలు నాగబాబు, వెంకటేశ్వర్లు, అశోక్ రెడ్డి, ఎస్సైలు నగేష్ కుమార్, సురేష్‌లు పాల్గొని ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, అక్రమ మద్యం విక్రయాలపై దృష్టి సారించి తనిఖీలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ద్వారా ప్రజల మధ్యకు వెళ్లి అసాంఘిక శక్తులను గుర్తించి చర్యలు తీసుకోవడం ప్రధాన ఉద్దేశమన్నారు. మణుగూరు పారిశ్రామిక ప్రాంతానికి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు అధిక సంఖ్యలో వస్తుండటంతో సరైన ఆధారాలు లేకుండా ఇళ్లను అద్దెకు ఇవ్వవద్దని గృహ యజమానులకు సూచించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు అద్దెకు ఉంటే వారి వివరాలను పోలీసులకు తెలియజేస్తే విచారణ చేపడతామని తెలిపారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన పోలీసులు, వాహనదారులకు హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ ప్రత్యేక సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వీడండి.. రోడ్డు వేయండి

### బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్యామ్ కుమార్ నలిగంటి

**పాలకుర్తి:** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని కుక్కలగూడూరు నుండి ధర్మారం ఎక్స్ రోడ్డు వరకు ప్రయాణం అంటేనే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని BRS పార్టీ నాయకులు శ్యామ్ కుమార్ నలిగంటి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల 27న బసంతనగర్ లారీ అసోసియేషన్ వారు 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేసినప్పటికీ, అధికారులు కనీసం అటువైపు చూడకపోవడం వారి నిర్లక్ష్యానికి పరాకాష్ట అని విమర్శించారు.

**సొంత నిధులతో రోడ్డు బాగు చేసిన అసోసియేషన్**

అధికారుల ఉదాసీనత వల్ల రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి, ఈరోజు ఒక లారీ బోల్తా పడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం చేయాల్సిన పనిని బసంతనగర్ లారీ అసోసియేషన్ వారు తమ సొంత నిధులతో కూర్మపల్లి మూలమలుపు వద్ద గుంతలను పూడ్చడం చూస్తుంటే వ్యవస్థ ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందని మండిపడ్డారు.

## పుట్నూరు శివారులో వడ్ల లారీ బోల్తా డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



**పాలకుర్తి:** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండల పరిధిలోని పుట్నూరు గ్రామ శివారులో వడ్ల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి ఆసుపత్రికి తరలించారు. స్థానికుల వివరాల ప్రకారం.పుట్నూరు ఐకేపీ కేంద్రం నుంచి వడ్ల లోడ్ తీసుకుని సుల్తానాబాద్ వైపు వెళ్తున్న లారీ గ్రామ శివారులో రోడ్డు గుంతల కారణంగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బసంత నగర్ చెందిన లారీ డ్రైవర్ గండికోట రాజేందర్ తీవ్రంగా గాయపడ్డాడు.జయ్యారం క్రషర్ల నుంచి ఓవర్ లోడ్ తో భారీ లారీలు తరచూ రాకపోకలు సాగించడం వల్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారిపై ఏర్పడిన పెద్ద గుంతల కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని వారు పేర్కొన్నారు. మరో వైపు లారీలో అధిక లోడ్ ఉండటంతోనే వాహనం నియంత్రణ కోల్పోయి బోల్తా పడిందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.ఈ ఘటనతో కొంతసేపు రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


## మణుగూరులో బీసీ జేఏసీ కార్యాలయం పునఃప్రారంభం..

- బీసీల ఐక్యతకు కొత్త వేదిక..
- హక్కుల సాధనకు కేంద్రబిందువుగా మారాలని నాయకుల ఆకాంక్ష..




**మణుగూరు, మహా :** పినపాక నియోజకవర్గంలో బీసీ వర్గాల ఐక్యత, హక్కుల సాధన లక్ష్యంగా మణుగూరులో బీసీ కులాల జేఏసీ కార్యాలయాన్ని శుక్రవారం ఘనంగా పునఃప్రారంభించారు. శ్రీశ్రీ నగర్ బోర్డు ఎదురుగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఉదయం 10 గంటలకు నాయకులు, సామాజిక కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు, వివిధ కుల సంఘాల సభ్యుల సమక్షంలో ప్రారంభించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ కార్యదర్శి బుర్ర సోమేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.., వెనుకబడిన వర్గాల హక్కుల సాధన కోసం బీసీ జేఏసీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు, సంక్షేమ పథకాల అమలులో ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి సంఘటిత శక్తి అవసరమని పేర్కొన్నారు. యువత సామాజిక చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మణుగూరు మండల బీసీ జేఏసీ నాయకుడు పొదిల వీరబాబు మాట్లాడుతూ, స్థానిక స్థాయిలో బీసీ వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యాలయం వేదికగా పనిచేస్తుందన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, విద్యా పరంగా బీసీలు బలపడితేనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవి, బొడ్డు చంద్రమౌళి, చారి, కుమారస్వామి, తౌడం శ్రీనివాస్, సదానందం గౌడ్, రంగు ఆంజనేయులు తదితరులు మాట్లాడుతూ బీసీ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహిళా నాయకులు సౌజన్య, చింతపాటి విజయలక్ష్మి, స్వరూప నజీమా, బెక్కం జయమ్మ, బోల్లు నర్సమ్మ, ముసలమ్మ, కుమారి పుష్ప మాట్లాడుతూ మహిళల సామాజిక భాగస్వామ్యం పెరగాలని, రాజకీయాల్లో మహిళలకు మరింత ప్రాధాన్యత కల్పించాలని అభిప్రాయపడ్డారు.త్రిమూర్తులు మరియు ఇతర కుల సంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొని జేఏసీ కార్యాలయం ప్రారంభాన్ని స్వాగతించారు. అనంతరం నాయకులు కలిసి కార్యాలయ బోర్డును ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ బీసీ ఐక్యతను చాటిచెప్పారు.

## మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మందా నాగరాజుకు ఘన సన్మానం



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మందా నాగరాజును భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సబ్కం నాగేశ్వరరావు మాట్లాడుతూ, సర్పంచ్‌గా ఎన్నికైన కొద్ది కాలంలోనే మండలంలోని 18 గ్రామ పంచాయతీల సర్పంచులు ఏకగ్రీవంగా నాగరాజును మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకోవడం హర్షణీయమన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తన గ్రామ పంచాయతీ అభివృద్ధితో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచుల సమస్యలను తన సమస్యలుగా భావించి ముందుండి నడిపించే నాయకుడిగా ఎదగాలని ఆకాంక్షించారు.గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం కోసం నాగరాజు సమన్వయంతో పనిచేసి మండలానికి ఆదర్శంగా నిలవాలని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి పాండవుల బిక్షం యాదవ్, మల్సూర్ యాదవ్, సింగబోయిన వెంకటేశ్వర్లు, భూక్య శ్రీను, సోడే వంశీ తదితరులు పాల్గొన్నారు.



## సారపాకలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

### లబ్ధిదారుల ఆనందంలో భాగమైన ప్రజాప్రతినిధులు

**బూర్గంపహాడ్ మహా :** పేద ప్రజలకు గౌరవప్రదమైన నివాస వసతి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన గృహంలో శుక్రవారం గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సారపాక సుందరయ్య నగర్‌కు చెందిన చౌక్కా లక్ష్మీ, గోవిందుల కొత్త ఇంటి గృహప్రవేశ వేడుకలో ప్రజాప్రతినిధులు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.పినపాక శాసనసభ్యులు శ్రీ పాయం వెంకటేశ్వర్లు గారి ఆదేశానుసారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్, బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు పూలపెల్లి సుధాకర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన అర్హుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి ఒక కల అని, ఆ కలను నిజం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లి కృష్ణ, పూజారి శ్రీదేవి, అనంతలక్ష్మి, భవాని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

## పరీక్షలు ప్రశాంతం

### ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 26 పరీక్షా కేంద్రాలలో గణిత శాస్త్రం పేపర్ 1ఏ, బోటనీ పేపర్ 1, రాజకీయ శాస్త్రం పేపర్ 1 పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్షలకు జనరల్ విభాగంలో 2971 మంది, వొకేషనల్ విభాగంలో 217 మంది అభ్యర్థులు కలిపి మొత్తం 3188 మంది కేటాయించగా అందులో 3037 మంది హాజరయ్యారని తెలిపారు. జనరల్ విభాగంలో 132 మంది, వొకేషనల్ విభాగంలో 19 మంది కలిపి మొత్తం 151 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు. పరీక్షల సందర్భంగా ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. తదుపరి రోజు పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో పరీక్షలు పూర్తిగా ప్రశాంతంగా సాగినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

# భారత్ దక్షిణ దిశగా నిశ్శబ్ద చొరబాట్లు

భారతదేశ అంతర్గత భద్రతా ముఖచిత్రం ఇప్పుడు ఒక చారిత్రాత్మకమైన , అత్యంత ప్రమాదకరమైన మలుపులో ఉంది. దశాబ్దాలుగా బంగ్లాదేశ్, మయన్మార్ సరిహద్దుల గుండా పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలకే పరిమితమైన అక్రమ చొరబాటుదారులు, ఇప్పుడు తమ వ్యూహాలను అనూహ్యంగా మారుస్తూ ఆర్థికంగా సుసంపన్నమైన భారతదేశంలో దక్షిణ రాష్ట్రాలను తమ కొత్త 'సేఫ్ జోన్ల'గా మార్చుకుంటున్నారు. సరిహద్దు రాష్ట్రాల్లో ఎన్ఐఏ , బీఎస్ఎఫ్ వంటి సంస్థల ఉక్కుపాదం, పౌరసత్వ చట్టాల కఠిన అమలు వల్ల ఉనికిని కోల్పోతున్న ఈ శక్తులు, ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు , కేరళ రాష్ట్రాల్లో నిశ్శబ్దంగా వేళ్లూనుకుంటున్నాయి. కూలీలు, నిర్మాణ రంగ కార్మికులు మరియు మున్సిపల్ సిబ్బంది ముసుగులో స్థానిక జనాభాలో కలిసిపోతున్న ఈ అక్రమ నెట్‌వర్క్, భవిష్యత్తులో దేశ సార్వభౌమాధికారానికి పెను ముప్పుగా పరిణమించే అవకాశముందని ఈ పరిశోధనాత్మక నివేదిక స్పష్టం చేస్తోంది.

ఈ వ్యూహాత్మక మార్పు వెనుక ఉన్న ప్రధాన కారణాలను విశ్లేషిస్తే, దక్షిణాన ఉన్న రాష్ట్రాల్లో చోటుచేసుకుంటున్న జనాభా మార్పులు , ఆర్థిక పరిస్థితులు ప్రధానంగా కనిపిస్తాయి. శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ 2021 డేటా ప్రకారం, సంబంధిత ఐదు రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు గణనీయంగా పడిపోయి 1.5 నుండి 1.6 శాతానికి చేరుకుంది, ఇది స్థానికంగా యువ కార్మికుల కొరతకు దారితీసింది. ఈ శూన్యాన్ని పూడ్చేందుకు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వలస కార్మికుల ప్రవాహంలో అక్రమ చొరబాటుదారులు 'లింగ్విస్టిక్ కామోఫ్లేజ్' (భాషాపరమైన మభ్యపెట్టడం) అనే వ్యూహాన్ని వాడుతున్నారు. బెంగాలీ లేదా హిందీ మాట్లాడటం వల్ల స్థానికులు వీరిని ఉత్తరాది కూలీలుగానే భ్రమపడుతున్నారు, ఇది వారు సమాజంలో ఏ మాత్రం అనుమానం రాకుండా కలిసిపోవడానికి దోహదపడుతోంది.

రవాణా మార్గాల దుర్వినియోగం ఈ చొరబాటును మరింత సులభతరం చేస్తోంది. సరిహద్దుల్లో నిఘా పెరిగినప్పటికీ, అస్సాంను ఒక ట్రాన్సిట్ రూట్‌గా వాడుకుని భారతీయ రైల్వే నెట్‌వర్క్ ద్వారా వీరు భారతదేశంలో దక్షిణాన ఉన్న నగరాలకు చేరుకుంటున్నారు. 2021 నుండి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ జరిపిన తనిఖీల్లో సుమారు 916 మంది అక్రమ చొరబాటుదారులు పట్టుబడగా, అందులో 586 మంది బంగ్లాదేశీయులు , 318 మంది రోహింగ్యాలు ఉండటం గమనార్హం. కేవలం 2024 జూన్, జూలై నెలల్లోనే నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే పరిధిలో 88 మంది అరెస్టయ్యారంటే, నిఘా నేత్రాల కళ్లుగప్పి ఎంత పెద్ద ఎత్తున ఈ వలసలు జరుగుతున్నాయో మనం అర్థం చేసుకోవచ్చు.

ఈ మొత్తం చొరబాటు ప్రక్రియ వెనుక అత్యంత పకడ్బందీగా పనిచేస్తున్న 'ఠేకేదార్' (దళారుల) సిండికేట్ ఒక భారీ మాఫియాగా అవతరించింది. మార్చి 2026లో బెంగళూరులో జరిగిన పోలీసుల స్పెషల్ డ్రైవ్ ఈ వ్యవస్థలోని విస్తుపోయే నిజాలను వెలుగులోకి తెచ్చింది. బంగ్లాదేశ్ వంటి దేశాల్లోని పేదలకు భారీ జీతాల ఆశ చూపి అక్రమంగా సరిహద్దులు దాటించే ఈ దళారులు, వారిని ఇక్కడ ఆధునిక బానిసలుగా మారుస్తున్నారు. ఉదాహరణకు, బృహత్ బెంగళూరు మహానగర పాలిక వ్యర్థాల విభజనలో కాంట్రాక్టర్లకు ఒక్కో కార్మికుడికి నెలకు ₹24,000 అందుతుండగా, అక్రమ వలసదారులకు కేవలం ₹5,000 మాత్రమే చెల్లించి మిగతా సొమ్మును దళారులు దోచుకుంటున్నారు. ప్రశ్నిస్తే పోలీసులకు పట్టిస్తామని బెదిరిస్తూ, వారిని గోదాముల్లో పశువుల్లా నిర్బంధిస్తూ ఈ అక్రమ సామ్రాజ్యాన్ని నడుపుతున్నారు.

వ్యవస్థలోని భద్రతా వైఫల్యాలను చొరబాటుదారులు ఏ స్థాయిలో వాడుకుంటున్నారో నకిలీ గుర్తింపు కార్డుల దందా స్పష్టం చేస్తోంది. ఢిల్లీ , బెంగళూరులో వెలుగుచూసిన రాకెట్ల వెనుక ఉన్న నెట్‌వర్క్ ఏకంగా జాతీయ దర్యాప్తు సంస్థ దృష్టికి వెళ్లిందంటే పరిస్థితి తీవ్రతను గమనించవచ్చు. బెంగళూరులోని ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఫార్మసిస్ట్ ఇష్తియాక్ పాషా వంటి వ్యక్తులు నకిలీ స్టాంపులతో ఆధార్ కార్డులు సృష్టించి అక్రమ వలసదారులకు అందజేస్తున్నారు. ఇటువంటి నకిలీ పత్రాలను ఉపయోగించి 'సైదుల్' అనే వలసదారుడు ఏకంగా ₹4 కోట్ల మేర హవాలా లావాదేవీలు జరిపి బంగ్లాదేశ్‌కు తరలించడం కేవలం ఆర్థిక నేరమే కాదు, దేశ ఆర్థిక సార్వభౌమాధికారంపై జరిగిన దాడి. ప్రజాస్వామ్య ప్రక్రియపై విదేశీయుల ప్రభావం ఈ భద్రతా సంక్షోభంలో మరో కీలక కోణం. మే 2026లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో సుమారు 30 మంది విదేశీ జాతీయులు దొంగ ఓట్లు



వేసి విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ అధికారులకు దొరికిపోవడం ఒక సంచలనం. బ్రిటీష్, కెనడా వంటి విదేశీ పాస్‌పోర్టులు కలిగి ఉండి కూడా స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో ఓటర్ల జాబితాలో చేరి ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రజాస్వామ్యపు పునాదులనే కదిలిస్తోంది. కేవలం ఈ ఏడాదిలోనే ఎన్నికల సంఘం సుమారు 60 మంది విదేశీయుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించిందంటే, స్థానిక ఇంటెలిజెన్స్ మరియు రెవెన్యూ వ్యవస్థలు ఏ స్థాయిలో విఫలమయ్యాయో అర్థం చేసుకోవచ్చు.

జనాభా మార్పులు తెస్తున్న సామాజిక అశాంతికి హైదరాబాద్ శివార్లలోని బాలాపూర్ ఒక ఉదాహరణగా నిలుస్తోంది. ఇక్కడ సుమారు 6,900 మంది రోహింగ్యాలు నివసిస్తుండటం స్థానికంగా తీవ్ర రాజకీయ మరియు మతపరమైన ఉద్రిక్తతలకు దారితీస్తోంది. 2026 జనవరిలో జరిగిన సభల్లో వెలువడిన విద్వేష ప్రసంగాలు మరియు దానికి ప్రతిస్పందనగా జరిగిన విజిలెంట్ దాడులు పరిస్థితిని మరింత దిగజార్చాయి. రోహింగ్యాలకు కనీస సదుపాయాలు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టులో దాఖలైన పిటిషన్లు మరియు వలసదారుల పిల్లల పాఠశాలలు మూసివేయించడం వంటి చర్యలు వారిని మరింత అట్టడుగు స్థాయికి నెట్టివేస్తున్నాయి. ఇటువంటి అభద్రతాభావం ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా మారి యువతను రాడికలైజ్ చేసే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దక్షిణాదిలో వెలుగుచూస్తున్న ఉగ్రవాద స్లీపర్ సెల్స్ మరియు ఐసిస్ కుట్రలు జాతీయ భద్రతా సంస్థలను ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయనగరం కేంద్రంగా ఆముదం గింజల నుంచి ప్రాణాంతక 'రైసిన్' విషాన్ని తయారు చేసి బయోటెర్రరిజానికి పాల్పడేందుకు జరిగిన ప్రయత్నాలను ఎన్ఐఏ విజయవంతంగా అడ్డుకుంది. ఆగస్టు 2025లో పట్టుబడిన ఆరిఫ్ హుస్సేన్ విచారణలో అంతర్జాతీయ నెట్‌వర్క్ బయటపడింది. దీనికి తోడు పుణె ఐఈడి బాంబుల కేసులో నిందితులు ముంబై ఎయిర్‌పోర్టులో పట్టుబడటం, దక్షిణాది నగరాలను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద శక్తులు తమ నెట్‌వర్క్‌ను ఏ స్థాయిలో విస్తరించాయో స్పష్టం చేస్తోంది.

ఆధునిక సాంకేతికతను ఉగ్రవాదం ఏ విధంగా సంతరించుకుందో మిజోరాంమయన్మార్ సరిహద్దులో పట్టుబడిన విదేశీ ఆపరేటర్ల ఉదంతం నిరూపిస్తోంది. ఆరుగురు ఉక్రెయిన్ జాతీయులు , ఒక అమెరికన్ పౌరుడు టూరిస్ట్ వీసాలపై వచ్చి నిషేధిత ముఠాలకు డ్రోన్ వార్‌ఫేర్ మరియు సిగ్నల్ జామింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. విదేశీ కిరాయి సైనికులు ఇలా చొరబాట్లకు పాల్పడి టెక్నాలజీని అందించడం రేపు దక్షిణాదిలోని కీలక ఐటీ , డిఫెన్స్ కారిడార్లకు ఏ క్షణమైనా ముప్పుగా పరిణమించవచ్చు. దీనికి తోడుగా పెరుగుతున్న నార్కోటిక్స్ స్మగ్లింగ్ , ఆయుధాల అక్రమ రవాణా దక్షిణాది నగరాల్లో క్రైమ్ రేటును అమాంతం పెంచుతున్నాయి.

సముద్ర తీరప్రాంత భద్రత ఇప్పుడు అతిపెద్ద సవాలుగా మారింది. 7,516 కిలోమీటర్ల సుదీర్ఘమైన తీర ప్రాంతాన్ని అంతర్జాతీయ స్మగ్లర్లు , ఉగ్రవాదులు తమ ప్రత్యామ్నాయ మార్గంగా ఎంచుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో 120 కిలోమీటర్ల తీరాన్ని కాపాడుకోవడానికి డ్రోన్ నిఘా వ్యవస్థను మోహరించడం, కేరళలో 'సాగర్ కవచ్' వంటి మాక్ డ్రిల్స్ నిర్వహించడం శుభపరిణామమే అయినప్పటికీ, నిఘా లోపాలు ఇంకా కొనసాగుతున్నాయి. మత్స్యకారుల పడవల్లో చొరబాట్లు జరగడం 26/11 వంటి దాడుల పునరావృతానికి అవకాశమిస్తుందని, దీనిని అరికట్టడానికి తీరప్రాంత సమాజాన్ని నిఘా వ్యవస్థలో భాగస్వాములను చేయాల్సి ఉందని భద్రతా నిపుణులు సూచిస్తున్నారు.

ఈ సంక్లిష్ట సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 2026లో 'ప్రహార్' జాతీయ ఉగ్రవాద నిరోధక సిద్ధాంతాన్ని ఆవిష్కరించింది. కేవలం దాడులు జరిగిన తరువాత స్పందించడం కాకుండా, ముందస్తు నివారణ సమగ్ర ప్రతిస్పందన లక్ష్యంగా ఈ విధానం రూపొందించబడింది. ఏడు కీలక స్తంభాలపై ఆధారపడిన ఈ సిద్ధాంతం, రాష్ట్ర పోలీసుల నుంచి ఎన్ఐఏ వరకు అందరినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి 'హోల్‌ఆఫ్‌గవర్నమెంట్' విధానాన్ని అమలు చేస్తోంది. రాడికలైజేషన్ నిరోధించడం , అంతర్జాతీయ సహకారాన్ని పెంచడం ద్వారా ఉగ్రవాద నెట్‌వర్క్‌లను సమూలంగా నిర్వీర్యం చేయడం దీని ప్రధాన ఉద్దేశ్యం.

ముగింపులో చెప్పాలంటే, దక్షిణాది రాష్ట్రాలపై పొంచి ఉన్న ఈ ముప్పు ఒక నిశ్శబ్ద 'టైమ్ బాంబ్' లాంటిది. తక్కువ కూలీకి వస్తున్నారు కదా అని గుర్తింపు లేని వ్యక్తులకు ఆశ్రయం కల్పించే కాంట్రాక్టర్లు , యజమానులు తమ స్వార్థం కోసం దేశ భద్రతను పణంగా పెడుతున్నారు. రాజకీయ వైరుధ్యాలను పక్కనపెట్టి దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతో ఎన్ఐఏ తో సంపూర్ణంగా సమన్వయం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. నకిలీ గుర్తింపు పత్రాల దందాను అరికట్టడం, నిరంతర నిఘా పెంచడం , 'ప్రహార్' సిద్ధాంతాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయడం ద్వారానే ఈ వినాశకర చొరబాటుకు మనం అడ్డుకట్ట వేయగలం. లేనిపక్షంలో, శాంతికి , ప్రగతికి చిరునామాగా ఉన్న దక్షిణాది అశాంతికి కేంద్రబిందువుగా మారే ప్రమాదం నూటికి నూరు శాతం ఉంది.


- గడల నరసింహారావు,
సీనియర్ జర్నలిస్ట్,ఖమ్మం.
9346923469*

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp:
74369 39999


## భారత్ కే యుద్ధ పరిష్కారం సాధ్యం



భారత్ మాత్రమే ప్రపంచ ఉద్రిక్తతలను తగ్గించగలదని రష్యా లాంటి అగ్రదేశాలు విశ్వసిస్తున్నాయి. పశ్చిమాసియాలో ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ చేసిన కీలక వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. భారత్ ఈ రెండు దేశాల మధ్య సమర్థవంతమైన మధ్యవర్తిగా సేవలు అందించగలదని . ఢిల్లీకి ఈ విషయంలో అపారమైన దౌత్య అనుభవం, అంతర్జాతీయ ప్రతిష్ఠ ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. దీంతో భారత్ దమ్ము ఏంటో మరోసారి ప్రపంచానికి తెలిసొచ్చింది. యుద్ధప్రభావంతో ప్రపంచమంతా అతలాకుతలం అవుతోంది. ట్రంప్ గాండ్రిపులను పోపోవోయ్ అన్నచందంగా ఇరాన్ లైట్ తీస్కుంది. పాక్ మధ్యవర్తిత్వంతో టైంపాస్ చర్చలు జరగ్గా ఎటూ తేలలేదు. ఇపుడు భారత్ కు మాత్రమే ఇది సాధ్యమని ఇతర దేశాలు ప్రకటిస్తున్నాయి. మనం ప్రతి ఘర్షణకు సంబంధించిన మూలకారణాలను అర్థం చేసుకోవాలి. ఇక్కడ మూలకారణం ఏమిటో మనకు తెలుసు. ఇరాన్ రెచ్చగొట్టకపోయినా, అమెరికా, ఇజ్రాయెల్‌లు దురాక్రమణకు పాల్పడ్డాయి. కానీ ఇప్పుడు అందరూ, ఇరాన్‌ను హర్మూజ్ జలసంధిని తెరవాలని డిమాండ్ చేస్తున్నారు. ఫిబ్రవరి 28 కంటే ముందు, అంటే దురాక్రమణ ప్రారంభం కాకముందు హర్మూజ్ జలసంధిలో ఎలాంటి సమస్యా లేదు. అసలు ఏ ఇబ్బందీ లేదు అని నేను మీకు గుర్తు చేయాలని అనుకుంటున్నాను. అప్పుడు అక్కడ నౌకాయానం పూర్తిగా 100 శాతం సురక్షితంగా సాగింది. కానీ తరువాత అమెరికా, ఇజ్రాయెల్‌లు దానిపై దాడి చేశారు. అయితే హర్మూజ్ జలసంధిని దిగ్బంధించింది ఇరాన్ కాదు. ఏదేమైనా ఈ యుద్ధానికి స్వస్తి పలకడం, కాల్పుల విరమణ చేపట్టడం ముఖ్యం" అని సెర్గీ లావ్రోవ్ పేర్కొన్నారు. "ప్రస్తుతం బ్రిక్స్ అధ్యక్ష దేశంగా భారత్ ఉంది. పశ్చిమాసియా ప్రాంత స్థిరత్వంలో దానికి ప్రత్యక్ష ప్రయోజనాలు ఉన్నాయి. బ్రిక్స్ అధ్యక్ష దేశంలో భారత్‌కు ఈ ప్రాంతం నుంచి చమురును పొందడంలో ప్రత్యక్ష ఆసక్తి ఉంది. అందువల్ల వారు ఎందుకు మధ్యవర్తిత్వం చేయకూడదు? ఇరాన్, యూఏఈలను మొదటగా ఆహ్వానించి, ఇరుదేశాల మధ్య ఎలాంటి శత్రుత్వాలు రాకుండా ఎలా పరిష్కరించాలో చర్చించచ్చు కదా?" అని లావ్రోవ్ చేసిన వ్యాఖ్యలు ఇపుడు చర్చనీయాంశంగా మారాయి.

భారత్ గతంలో ప్రపంచంలోని ఎన్నో ఘర్షణలను ఆపుచేయడానికి తీవ్ర కృషి చేసింది. కొరియా యుద్ధం (1953)లో యుద్ధ ఖైదీల స్వదేశీ పునరావాసం విషయంపై భారత్ తన ప్రతిపాదనలు చేసింది. వియత్నాం (195060)ల్లో అంతర్జాతీయ పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్ (ఐసీఎస్సీ)కు భారత్ అధ్యక్షత వహించి, ప్రాంతీయ స్థిరత్వాన్ని పెంపొందించింది. 1955లో ఆస్ట్రియా తటస్థంగా ఉంటున్నట్లు ప్రకటించడంలో భారత్ సహాయం ఎంతో ఉంది. ఇది సోవియట్ దళాల ఉపసంహరణకు వీలుకల్పించింది. ఇక ఆ తరువాత సూయజ్ కాలువ సంక్షోభం, కాంగోఇరాన్ ఇరాక్ యుద్ధ సమయంలో భారత్ శాంతి ప్రయత్నాలు చేసింది. ఇక జీ20 అధ్యక్షతను రష్యాఉక్రెయిన్ మధ్య ఘర్షణల వల్ల అభివృద్ధిపై పడుతున్న ప్రభావాన్ని భారత్ హైలెట్ చేసింది. ఈ విధంగా ప్రపంచంలో రాజకీయ ఉద్రిక్తతలు పెరగకుండా భారత్ కృషి చేసింది. ఇపుడు కూడా భారత్ చొరవ కోసం ప్రపంచదేశాలు ఒక్కొక్కటిగా గళం విప్పుతున్నాయి.

## ఈ చిన్ని చిన్న అలవాట్లే అనారోగ్యానికి కారణం!



**మనం రోజూ వ్యాయామం చేసి, మంచి ఆహారం తీసుకున్నా.. కొన్ని చిన్న చిన్న జీవనశైలి పొరపాట్ల వల్ల అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ శిక్షణ పొందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి సూచించిన ఈ ప్రమాదకరమైన అలవాట్లు, వాటి ప్రభావాల గురించి ఇక్కడ తెలుసుకోండి.**

ఆరోగ్యం అనేది కేవలం డైట్ , జిమ్‌కే పరిమితం కాదు! మనం రోజూ చేసే చిన్న చిన్న పనులే మన శరీరంపై పెద్ద ప్రభావాన్ని చూపుతాయి. 2026 నాటికి ఆరోగ్యంపై అవగాహన పెరిగినప్పటికీ, తెలియకుండానే మనం చేసే కొన్ని పొరపాట్లు దీర్ఘకాలిక సమస్యలకు దారితీస్తున్నాయి. ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి ప్రకారం.. మెరుగైన ఆరోగ్యం కోసం ఈ కింది అలవాట్లను తక్షణమే వదిలేయాలి.

### తప్పుడు భంగిమలో కూర్చోవడం..

9 టు 5 ఉద్యోగాల్లో ఉండే వారు గంటల తరబడి వంగి కూర్చోవడం వల్ల వెన్ను, మెడపై తీవ్రమైన ఒత్తిడి పడుతుంది. ఇది కీళ్ల నొప్పులు, శరీరంలో బిగుతు, దీర్ఘకాలిక వెన్నునొప్పికి దారితీస్తుంది.

### మూత్రాన్ని ఆపుకోవడం..

చాలామంది పని ఒత్తిడిలోనో లేదా సోమరితనంతోనో మూత్రాన్ని ఎక్కువసేపు ఆపుకుంటారు! ఇలా చేయడం వల్ల మూత్రాశయం బ్యాక్టీరియాకు నిలయంగా మారుతుంది. ఇది యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ (యూటీఐ) ముప్పును పెంచుతుంది. ముఖ్యంగా 5060 శాతం మంది మహిళలు తమ జీవితంలో కనీసం ఒక్కసారైనా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### టాయిలెట్‌లో ఎక్కువసేపు గడపడం..

టాయిలెట్‌ను చాలామంది సోఫాలా వాడుతుంటారు. ఫోన్ పట్టుకుని గంటల తరబడి అక్కడే కూర్చోవడం వల్ల మలద్వారం వద్ద ఉండే వెయిన్స్‌పై విపరీతమైన ఒత్తిడి పడుతుంది. దీనివల్ల మొలలు లేదా పైల్స్ వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్ సేథి హెచ్చరిస్తున్నారు.

### వేగంగా ఆహారం తీసుకోవడం..

ఐదు, పది నిమిషాల్లో భోజనం ముగించడం గొప్ప విషయం కాదు. వేగంగా తినడం వల్ల మనం ఎంత తింటున్నామనే సిగ్నల్ మెదడుకు అందదు. దీనివల్ల అతిగా తినడం, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తుతాయి.

### మాటిమాటికీ ముఖాన్ని తాకడం..

మన చేతులు రోజంతా వందలాది వస్తువులను తాకుతుంటాయి. తద్వారా మన చేతులపై వేలాది బ్యాక్టీరియా, వైరస్‌లు చేరుతాయి. ఆ చేతులతో ముఖాన్ని తాకినప్పుడు చర్మంపై ఇన్ఫెక్షన్లు, మొటిమలు వచ్చే అవకాశం ఉంటుంది.

### వేడి వేడి నీళ్లతో స్నానం చేయడం..

రోజంతా కష్టపడి వచ్చిన తర్వాత వేడి నీళ్లతో స్నానం హాయిగా అనిపించవచ్చు. కానీ రోజూ వేడి నీళ్లు వాడటం వల్ల చర్మంపై ఉండే సహజసిద్ధమైన నూనెలు నశిస్తాయి. దీనివల్ల చర్మం పొడిబారిపోవడం, దురద, అలర్జీలు వచ్చే అవకాశం ఉంది. ఈ విధంగా.. పెద్ద పెద్ద మార్పులు కాకపోయినా, మన దైనందిన జీవితంలో ఇలాంటి చిన్న చిన్న అలవాట్లను మార్చుకోవడం వల్ల మెరుగైన ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. సంపూర్ణ ఆరోగ్యానికి క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

### ఆహారాన్ని వేగంగా తినడం వల్ల బరువు పెరుగుతామా?

అవును, ఆహారాన్ని వేగంగా తినడం వల్ల బరువు పెరిగే అవకాశం చాలా ఎక్కువ. మనం ఆహారం తీసుకునేటప్పుడు కడుపు నిండిందనే సంకేతం మెదడుకు చేరడానికి సుమారు 20 నిమిషాల సమయం పడుతుంది. మీరు ఐదు లేదా పది నిమిషాల్లోనే భోజనం ముగిస్తే, మెదడుకు ఆ సంకేతం అందక ముందే మీరు అవసరానికి మించి క్యాలరీలను తీసుకుంటారు. దీనివల్ల జీర్ణక్రియ మందగించి, శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది.

### గోళ్ల చుట్టూ ఉండే చర్మాన్ని పీకడం వల్ల కలిగే 'పరోనిచియా' అంటే ఏంటి?

పరోనిచియా (Paronychia) అనేది వేలు గోరు చుట్టూ ఉండే చర్మం వద్ద కలిగే ఒక రకమైన ఇన్ఫెక్షన్. చర్మాన్ని పీకడం వల్ల అక్కడ చిన్న గాయాలు ఏర్పడతాయి. వాటి ద్వారా బ్యాక్టీరియా లేదా ఫంగస్ చర్మం లోపలికి ప్రవేశించి వాపు, నొప్పి, ఎరుపు రంగులోకి మారడం, చీము పట్టడం వంటి సమస్యలకు దారితీస్తుంది. కొన్నిసార్లు ఇది తీవ్రంగా మారి గోరు ఊడిపోయేలా కూడా చేస్తుంది.

# ఆదాయం పెంచటం ఎలా...!

- నిధులు రాబట్టటం కోసం మార్గాలు ఏంటీ
- వర్క్షాపులో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

**నేలకొండపల్లి, మహా:** పంచాయతీలకు నిధులు రాబట్టేందుకు అవసరమైన మార్గాలు...ఆదాయం పెంచుకోవటం ఎలా.... వచ్చిన వాటిని ఎలా వినియోగించాలి అనే తదితర విషయాల పై జరిగిన వర్క్షాపు నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సూర్యాపేట, ఖమ్మం, నల్లగొండ, యాద్రాది భువనగిరి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో సూర్యాపేట లో తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ వారి ఆధ్వర్యంలో ఆరు జిల్లాల స్థాయి లో వర్క్ షాపు ను నిర్వహించారు. య ప్రత్యేక వర్క్షాపు ను శుక్రవారం నిర్వహించారు. ఈ 'వర్క్షాపు లో నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య, చింతకాని' ఎంపీడీఓ చంచు శ్రీనివాసరావు, సర్పంచ్ ల నుంచి కె.ఆదినారాయణ, (వీవీపాలెం), అశ్విని (తాటిపూడి) లు, మాజీ ఎంపీటీసీ ల నుంచి "కట్టెకోల సుధాకర్ (బోదులబండ, నేలకొండపల్లి మండలం), బొర్రా ప్రసాదరావు, (పాతర్లపాడు, చింతకాని మండలం) లను వర్క్ షాపు కు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంపించారు. వర్కషాపు లో పంచాయతీలకు నిధులు ఎలా రాబట్టాలి...కొత్తగా ఆదాయం మార్గాల అన్వేషణ పై వర్క్షాపు జరిగింది. ప్రస్తుత సర్పంచ్లు అభిప్రాయాలు తెలుసుకున్నారు. అదే విధంగా మాజీ ఎంపీటీసీ లను వారి గత అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీల రెవిన్యూ *పెంచుకునే విధంగా ఆర్థిక స్వలంభనా, ఆర్థిక వనరుల సృష్టి తదితర అంశాల పై అవగాహన కల్పించారు. ఈ వర్క్షాపు లో తెలంగాణ స్టేట్ కార్పోరేషన్ చైర్మన్ రాజయ్య పలు అంశాల పై వివరించారు. జిల్లా కు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు వారి అనుభవాలను, సూచనలు, సలహాలు అందించారు.

# వార్షిక లక్ష్యాల సాధనకు సింగరేణి సిద్ధం..

- మణుగూరు ఏరియాలో 3 రోజుల అవగాహన కార్యక్రమాలు
- ఒకే లక్ష్యం.. ఒకే గమ్యం..
- ఏరియా జీఎం దుర్గం రామచందర్..




**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మణుగూరు ఏరియా సాధించిన ప్రగతి, భవిష్యత్ ప్రణాళికలు, కార్మిక సంక్షేమ కార్యక్రమాలు, మల్టీ డిపార్ట్‌మెంటల్ టీమ్స్ ఆధ్వర్యంలో ఎదుర్కొంటున్న సవాళ్లపై ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ శుక్రవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో సవివరంగా వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ భవిష్యత్ కార్యాచరణను తెలియజేశారు. మే 18 నుంచి 20 వరకు మణుగూరు ఏరియాలోని గనుల్లో కార్మికులు, యూనియన్ ప్రతినిధులు, అధికారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

**భారీ ఉత్పత్తి లక్ష్యాలు..**

202526 ఆర్థిక సంవత్సరంలో సంస్థ 580.04 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిందని తెలిపారు. 2026 27 సంవత్సరానికి 650 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 4,630 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు, 680 లక్షల టన్నుల బొగ్గు రవాణా లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. మణుగూరు ఏరియాకు సంబంధించి 96.26 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 664 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. భారీ యంత్రాల వినియోగ సమయాన్ని పెంచి, షావెల్స్, డంపర్ల నిరుపయోగ సమయాన్ని తగ్గించడం ద్వారా ఉత్పత్తిని మరింత పెంచాలని సూచించారు.భవిష్యత్ అవసరాల దృష్ట్యా మణుగూరులో 2.10 మిలియన్ టన్నుల సామర్థ్యంతో కొత్త ప్రాజెక్టు ప్రారంభానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

**కార్మిక సంక్షేమానికి పెద్దపీట..**

రిటైర్డ్ కార్మికుల కోసం అమలులో ఉన్న కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికేర్ స్కీమ్ ద్వారా ఆరోగ్య బీమా సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఉద్యోగులకు రూ.1 కోటి ప్రమాద బీమా, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.10 లక్షల ఉచిత బీమా అందిస్తున్నామని వివరించారు. మహిళా కార్మికులకు ఇద్దరు పిల్లలకు గాను 730 రోజుల చైల్డ్ కేర్ లీవ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల గృహ రుణాలపై వడ్డీని సంస్థ భరిస్తోందని, మణుగూరు ఏరియాలో 305 మంది లబ్ధి పొందినట్లు చెప్పారు. మణుగూరు ఏరియాలోని క్వార్టర్లలో ఏసీ సౌకర్యాల కోసం ఎలక్ట్రికల్ బోర్డుల ఏర్పాటు పూర్తయిందని, కొత్తగా 110 క్వార్టర్ల నిర్మాణానికి అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. కారుణ్య నియామకాల కింద సంస్థ వ్యాప్తంగా 13,055 మందికి, మణుగూరు ఏరియాలో 474 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు వెల్లడించారు. ఉద్యోగుల పిల్లలు ఐఐటీ, ఐఐఎం లలో సీట్లు సాధిస్తే పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు తెలిపారు.

**సిఎస్ఆర్‌తో అభివృద్ధి పనులు..**

సింగరేణి సేవా సమితి ద్వారా 1982 మంది యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించినట్లు చెప్పారు. పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్ ఆధునికీకరణ, అంతర్గత రహదారులు, పార్కింగ్ షెడ్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సామాజిక బాధ్యత నిధుల కింద మణుగూరు ఏరియాకు రూ.26.96 కోట్లు కేటాయించగా, అందులో రూ.22 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్స్, పాఠశాలల అభివృద్ధి చేపట్టినట్లు వెల్లడించారు.

**భద్రతతో లక్ష్యాల సాధన..**

ఒకే కుటుంబం.. ఒకే లక్ష్యం.. ఒకే గమ్యం అనే స్ఫూర్తితో కార్మికులంతా పని చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మార్కెట్ పోటీని తట్టుకోవాలంటే ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ 202627 లక్ష్యాలను అధిగమించాలని కార్మికులకు సూచించారు.ఈ సమావేశంలో ఎస్‌వో టు జీఎం బి. శ్రీనివాస చారి, పీఓ పీకేఓసీ ఎం. శ్రీరమేశ్, ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్, ఏజీఎం ఐఈడీ సిహెచ్. రాంబాబు, ఏజీఎం పర్సనల్ ఎస్. రమేశ్, ప్రాజెక్ట్ అధికారి ఎంఎన్ జీఓసీ ఈ. శ్రీనివాస్, డీజీఎం కేసీహెచ్‌పీ మధన్ నాయక్, డీజీఎం సివిల్ జి. శివప్రసాద్, ఏరియా సర్వే అధికారి ఎల్. దయాకర్, డీజీఎం క్వాలిటీ నాగరమేష్, ఏరియా స్టోర్స్ డీజీఎం రామకృష్ణ, డీజీఎం ఈ అండ్ ఎం, సీనియర్ ఎస్టేట్స్ అధికారి కే. స్వప్న, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, పర్చేస్ హెచ్‌వోడి కే. సుదర్శన్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు వి. కృష్ణంరాజులు పాల్గొన్నారు.

# టీజేఏసీ నాయకులు ముందస్తు అరెస్ట్




**నేలకొండపల్లి, మహా:** చలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమం కు తరలివెళ్తున్న తెలంగాణ "జేఏసీ నాయకులను స్థానిక పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. తమ న్యాయమైన కోర్కెలను వెంటనే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం తలపెట్టిన చలో సెక్రటేరియట్ ముట్టడి కి తరలివెళ్లకుండా స్థానిక పోలీసులు మండలం లోని జేఏసీ నాయకులను ముందస్తు అరెస్ట్ లు చేశారు. ఈ సందర్భంగా టీజేఏసీ జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు మాట్లాడారు... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తాము చేసిన త్యాగాలను గుర్తించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మార్లు డిమాండ్ల ను పరిష్కరించాలని ఉద్యమాలు చేపట్టినప్పటికీ నేటి వరకు అమలు చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని గ్రహించాలని సూచించారు. ఎన్ని ఇబ్బందులు 'పెట్టినా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తీగ రాములు, మేకల వెంకటేశ్వర్లు, మందపాటి వెంకటేశ్వర్లు, బీ.రామనాధం, చిన్న యాకయ్య, గుగులోత్ ఆంజనేయులు, యం.శ్రీనివాసరావు, వడ్డె జగన్ తదితరులు ఉన్నారు.

# తాగునీటి కోసం గోరుకొండ ఆదివాసుల కష్టాలు

**మాజీ సర్పంచ్ కారం కన్నరావు**



**చర్ల మహా :** చర్లమండలం మారుమూల గిరిజన గ్రామం అయినటువంటి తిప్పాపురం గ్రామపంచాయతీ పరిధిలోని గోరుకొండ గ్రామంలో గత 3 వారాలుగా తాగునీరు లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అధికారులకు మరియు పాలకవర్గం కి చెప్పిన ఎటువంటి ఉపయోగం లేదు అందువల్ల ఈరోజు మాజీ సర్పంచ్ కారం కన్నరావు ఆధ్వర్యంలో గోరుకొండ వాటర్ ట్యాంక్ వద్ద నున్న రోడ్ పై ధర్నా నిర్వహించారు ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే గ్రామానికి త్రాగునీరు అందించాలి అని నిరసన తెలియచేశారు అధికారి తక్షణం స్పందించకపోతే ఐటిడిఎ PO గారి కార్యాలయం ముందు ధర్నాకు కూడా సిద్ధమవుతం అని తెలియచేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిన్న ముస్కి భీమా ముస్కి దేవ పోడియం దేవ కలము లక్మ మాదివీ దుల్లయ్య గట్టుపల్లి రాజు మరియు స్థానిక మహిళలు పాల్గొన్నారు

# ఉపాధి హామీ కూలీల వద్దకు ఉపాధ్యాయులు

**ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ బోధన**



**నేలకొండపల్లి, మహా :** ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ బోధన జరుగుతుందని ప్రధాన ఉపాధ్యాయుడు ఆనంద్ ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం ను నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి మీ పిల్లల చదువు మా బాధ్యత ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నారని అన్నారు. మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అనేక కార్యక్రమాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రవేట్ మోజులో పడి విద్యార్థుల జీవితాలను నాశనం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలి

- నామినేటెడ్ వ్యవస్థను రద్దు చేయాలి
- సండ్ర నరేంద్ర కుమార్ డిమాండ్
- తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు ధర్నా



**జూలూరుపాడు, మహా:** సహకార సంఘం ఎన్నికలు ప్రభుత్వం తక్షణమే నిర్వహించాలని, నామినేటెడ్ వ్యవస్థను రద్దు చేయాలని, రైతు సంఘం భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు సండ్ర నరేంద్ర కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలకు తక్షణం ఎన్నికలు నిర్వహించి పాలకమండలని ఏర్పాటు చేసి, సహకార సంఘాలను బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు జరపకుండా నామినేట్ ద్వారా పాలక మండలి ఏర్పాటు చేయాలనే ఆలోచన తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాస రోశయ్య, ఎల్లంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, తూము కోటయ్య, పొన్నగంటి వెంకటేశ్వర్లు, చిమట ముత్తయ్య, ముత్తిలింగం ఊడల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపు..

## కేంద్రంపై బచ్చలకూరి నాగరాజు ఆగ్రహం..

**నెలకొండపల్లి, మహా:** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు బచ్చలకూరి నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలు పెంచి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మరో భారం మోపిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ రేట్లను మళ్లీ పెంచిన మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని నాగరాజు ఆగ్రహించారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు, గ్యాస్, విద్యుత్ ఛార్జీలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నాయని, దేశంలో మాత్రం పెట్రోల్ రేట్లను పెంచి కేంద్రం దోచుకుంటోందని నాగరాజు ఆరోపించారు. మోదీ ప్రభుత్వ చర్యలతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని వస్తువుల ధరలపై ప్రభావం పడుతుందన్నారు. చివరకు సామాన్యుడు తీవ్రంగా నష్టపోతాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధానాలకే పరిమితమైందని ఆయన విమర్శించారు.ప్రజా సంక్షేమం కంటే పన్నుల వసూళ్లపైనే మోదీ ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని నాగరాజు డిమాండ్ చేశారు..



# వేసవీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కారేపల్లి, మహా :** పుస్తక పఠనం ఉన్నత శిఖరాలకు పునాది వంటిదని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం గ్రంథాలయం దినోత్సవాన్ని కారేపల్లి మోడల్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎంవో మాట్లాడుతూ గ్రంథాలయాలు హార్ట్ ఆఫ్ నాలెడ్జిగా ఉండి మన ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో తోడ్పడుతాయన్నారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్రీడలు మరియు లిటరరీ కృత్యాలు శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంచుతాయని తద్వారా బాల బాలికలు తమ వ్యక్తిత్వ వికాసాభివృద్ధిలో ఇవి చాలా కీలకపాత్ర పోషిస్తాయని ఏఎంవో పెసర ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఏఎంవో వెంట ఎంఈవో దుగ్గిరాల జయరాజు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజలపై ధరల భారం మోపిన బీజేపీ

## పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలి - సీపీఐ(ఎం)



**కారేపల్లి, మహా :** ఎన్నికల అయ్యేంత వరకు పెరగని డీజిల్, పెట్రోల్ ధరలు ప్రజలతో అవసరం తీరగానే బీజేపీ ప్రభుత్వం ఆమాంతం డీజిల్, పెట్రోల్ ధరలు పెంచిందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. శుక్రవారం కారేపల్లిలో విలేకరుల తో మాట్లాడుతూ మోదీ అధికారం వచ్చిన తర్వాత పేదల గురించి కాకుండా తన కార్పొరేట్ మిత్రుల నష్టాల గురించి అలోచిస్తున్నాడని ఎద్దేవా చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా భారం పడుతుందన్నారు.పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువులు, కూరగాయలు, బస్సు ఛార్జీలు, క్యాబ్ సేవలు వంటి రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఎన్నికల ప్రచారంలో దేశం అభివఅద్ధి జరగాలంటే బిజెపికి ఓటెయ్యండని చెప్పిన ప్రధాని మోడీ ఎన్నికలు అవసరం తీరిన తర్వాత బీజేపీ డబల్ ఇంజన్ సర్కారు మాయ మాటలు ప్రజలు అర్థం అవుతుందన్నారు. ప్రజాగ్రహం చవిచూడక ముందే తక్షణమే పెంచిన ధరలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర పెంపుపై సీపీఐ(ఎం) ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన ఉదఅతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు తలారి దేవ ప్రకాశ్, ముండ్ల ఏకాంబరం, పాసిన్ని నాగేశ్వరరావు, అన్నారపు కృష్ణ, ముక్కా సీతారాములు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తరుగు దోపిడీ

## రైతుల శ్రమ దోపిడీ నిలిపివేయాలని సిపిఐ డిమాండ్



**జూలూరుపాడు, మహా:** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో క్వింటాకు ఐదు కిలోల తరుగు తీయడం రైతులను నిలువు దోపిడీ చేయడమేనని, దీనిని వెంటనే నిలిపివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్కే ఫంక్షన్ హాల్ లో వల్లమల సామేలు అధ్యక్షతన జరిగిన మండల కౌన్సిల్ సమావేశం లో పాషా పాల్గొని మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి వస్తే, తరుగు పేరుతో అడ్డగోలుగా కోత విధిస్తూ అన్నదాతలను మోసం చేయడం అన్యాయమన్నారు. ఇప్పటి వరకు కోత పెట్టిన ధాన్యం విలువను లెక్కకట్టి ఆ సొమ్మును తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావలసిన కనీస వసతులు కల్పనలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ధాన్యం సేకరించాలని కోరారు. ఈ సమావేశం లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్, మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎస్కే నాగుల్ మీరా, ఎల్లంకి మధు, యాస రోశయ్య, తూము కోటయ్య, పోనేకంటి వెంకటేశ్వర్లు, కంచర్ల రాఘవేంద్రరావు, సిరిపురపు వెంకటేశ్వర్లు, కొండ వీరయ్య, చిమట ముత్తయ్య, పాలెపు ప్రభాకర్, ఊడల సుధా, బరగడ రమేష్, పత్తిపాటి మహేష్, ఉదారి నాగయ్య, చల్లగొండ్ల సతీష్, చీమకుర్తి సంతోష్, యరాదశి రామారావు తదితరులు పాల్గొన్నారు.



## మణుగూరులో ప్రైవేట్ ఆసుపత్రులు,

# డయాగ్నస్టిక్ కేంద్రాల తనిఖీలు

- అనుమతులు లేకుంటే కఠిన చర్యలు..
- డీఎంహెచ్‌వో ఆదేశాలతో ప్రత్యేక తనిఖీలు..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో మణుగూరులోని పలు ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు డాక్టర్ రామదాసు నేతృత్వంలో ఈ తనిఖీలు చేపట్టారు.మణుగూరు కేంద్రంలోని అమూల్య డయాగ్నస్టిక్ సెంటర్లు, ప్రమోద్ డెంటల్ ఆసుపత్రి, సుశ్రుత హాస్పిటల్, నాగార్జున డెంటల్ ఆసుపత్రి, సింగరేణి ఏరియా ఆసుపత్రులను అధికారులు పరిశీలించారు. ఆసుపత్రుల నిర్వహణకు అవసరమైన అనుమతులు, రికార్డులు, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అనుమతులు లేకుండా ఆసుపత్రులు లేదా డయాగ్నస్టిక్ సెంటర్లు నిర్వహిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత నిర్వాహకులను అధికారులు హెచ్చరించారు. తనిఖీలకు సంబంధించిన పూర్తి నివేదికను జిల్లా వైద్య, ఆరోగ్య అధికారికి సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరీష్, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ బేబీ, జూనియర్ అసిస్టెంట్లు శ్రీధర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పంట అవశేషాలు కాల్చవద్దు

**నెలకొండపల్లి ఎస్సై పి సంతోష్**



**నేలకొండపల్లి, మహా :** మండల కేంద్రంలోని భూముల్లో పంట కోత అనంతరం మిగిలే మొక్కజొన్న, వరి గడ్డి మరియు ఇతర పంట అవశేషాలను కాల్చడం పల్ల పర్యావరణానికి తీవ్రమైన నష్టం కలుగుతుంది. ఎస్ఐ పి సంతోష్ సూచించారు. గాలి కాలుష్యం పెదగరం, నేజలో ఉన్న సేంప్రయ పదార్థాలు మరియు ఉపయోగకర సూక్ష్మజీవులు నశించడం జరుగుతుంది. అదేవిధంగా ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. వంట అవశేషాలను కాల్చకుండా వాటిని నేలలో కలిపి సేంద్రియ ఎరువులుగా వినియోగిం చుకోవాలని రైతులకు సూచించడమైనది. రోటావేటర్, సుబ్బర్ వంటి యంత్రాల ద్వారా పంట అవశేషాలను సమర్థవంతంగా నిర్వహించవచ్చు. పంట అవశేషాల దహనం చేయడం చట్టరీత్యా నిషేధించబడిన చర్య అట్టి చర్యలకు పాల్పడిన వారిపై ప్రభుత్వం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అందువల్ల రైతులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై వంట అవశేషాలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని ఎస్సై పి సంతోష్ సూచించారు.



## ఉపాధి కూలీల


# ఆందోళన

**అంక్షలు లేకుండా ఉపాధి కల్పించాలి - వ్యకాస**

**కారేపల్లి, మహా :** ఉపాధి హామీ సమస్యలపై కారేపల్లి మండలం గాంధీనగర్ గ్రామపంచాయతీ ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధీ కూలీలు శుక్రవారం అందోళన చేశారు. ఉపాధీ పనులకు రెండు సార్లు ఫోటో, నిధులలో కోత, సమ్మర్ అలివెన్స్ నిలిపివేత, పని ప్రాంతంలో సౌకర్యాలు కల్పన, పనిముట్ల పంపిణి చేయాలని ఉపాధీ కూలీలు డిమాండ్ చేశారు. అనంతరం జీపీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వ్యకాస మండల అధ్యక్షులు కేసగాని ఉపేందర్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఉపాధీ హామీ చట్టానికి తూట్లు పొడిచి రాజ్యాంగ బద్ద పని హక్కును హరిస్తుందని విమర్శంచారు. ఎన్ఆర్ఈజీఎస్ ను వీబీజీరాంజీ గా పేరు మార్చటంతో పాటు నిధులలో కోత విధించిందన్నారు. రోజు వారి కూలీ రూ.307 ఇవాల్సి ఉండగా ప్రస్తుతం రూ.150 కూడా పడటం లేదన్నారు. పని ప్రదేశాలలో టెంట్, నీరు, మెడికల్ కిట్స్ కల్పించటం లేదన్నారు. కూలీలకు ప్రమాధ భీమా కేంద్రం ప్రభుత్వం అమలు చేయాలని ప్రమాదానికి గురైతే రూ.10 లక్షలు సాయం అందించాలన్నారు. ఉపాధి పనులను 200 రోజులకు పెంచి రూ.600 వేతనం, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. ఉపాధీ హామీ పథకం సమస్యలపై వ్యకాస నిర్వహిస్తున్న పోరాటాలలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఉపాధీ కూలీలు జయసుధ, పద్మ, బాయమ్మ, సుజాత, నాగమణి, మౌనిక, అంబిక, విజయ, దశరథ్, పుల్లయ్య పాల్గొన్నారు

# మణుగూరు పీకేఓసీ–2 గనిలో అగ్నిప్రమాదం..

- బ్రహ్మపుత్ర షావల్ దగ్ధం..
- రూ.3 కోట్లకుపైగా ఆస్తినష్టం అంచనా
- ఆపరేటర్ సురక్షితం..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియాలోని సింగరేణి పీకేఓసీ-2 ఓపెన్‌కాస్ట్ గనిలో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గనిలో పనిచేస్తున్న భారీ బ్రహ్మపుత్ర షావల్ ఒక్కసారిగా మంటలకు ఆహుతైనట్లు సమాచారం. ఈ ఘటనలో సుమారు రూ. 2 నుంచి 3 కోట్లకుపైగా ఆస్తినష్టం సంభవించినట్లు అంచనా వేస్తున్నారు. అయితే, షావల్ ఆపరేటర్ అప్రమత్తంగా వ్యవహరించి సురక్షితంగా బయటపడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక చర్యలు చేపట్టారు. షావల్‌లో మంటలు చెలరేగిన వెంటనే ఆపరేటర్ స్వయంగా మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాకపోవడంతో ట్యాంకర్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు తెలిసింది. ఈ ఘటనపై మణుగూరు ఏరియా ఏజీఎం (పర్సనల్) సలగల రమేష్ స్పందిస్తూ, బ్రహ్మపుత్ర షావల్ దగ్ధమైన విషయం వాస్తవమేనని తెలిపారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని, అధికారుల స్థాయిలో విచారణ కొనసాగుతోందన్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని స్పష్టం చేశారు.గతంలో ఈ తరహా షావల్ విలువ రూ.2 నుంచి రూ.2.5 కోట్ల వరకు ఉండేదని, ప్రస్తుతం దాని ధర రూ.3 నుంచి రూ.3.5 కోట్ల వరకు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సామాన్యుల పాలిట శాపంగా

# మోదీ సర్కార్ నిర్ణయాలు...!

- మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా ఇంధన ధరల పెంపు
- దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవసరం గుర్తుకొస్తుందన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పేదల సంక్షేమం మరిచి, అడుగడుగునా ఆర్థికంగా అణిచివేసే విధంగానే పదేళ్ల మోదీ పాలన ఉందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి విమర్శించారు. మత విద్వేషాలు, జాతీయవాదంతో ఎన్నికల్లో నెగ్గి.... తర్వాత పేదలపాలిటశాపంగా మారారని ఆరోపించారు. బంగారం కొనుగోలు ఆపేయాలని, ఖర్చులు తగ్గించాలని, వాహనాలు వాడవద్దంటూ జాతిని కోరుతున్న ప్రధాని.... దీనికి కారణం ఎవరో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 3దశాబ్దాల క్రితం ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో పీవీ, మన్మోహన్ సింగ్ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలే నేడు దేశాన్ని నడిపిస్తున్నాయని.... సరైన నిర్ణయాలు తీసుకోవటంలో మోదీ సర్కార్ వైఫల్యమే నేటి ఆర్థిక విపత్తులకు కారణమన్నారు. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల వేళ మౌనంగా ఉండి, పూర్తైన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరల్ని పెంచటం ప్రజలను వంచించటమేనని విమర్శించారు. దేశంలో నేడు నెలకొన్న పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ అవసరాన్ని గుర్తుచేస్తుందని చెప్పారు. యూపీఏ హయాంలో తెచ్చిన ఉపాధిహామీ పథకంలాంటి వాటిని నిర్వీర్యం చేసి, రాష్ట్రాలపై ఇప్పటికే పెనుభారం మోపటమే కాకుండా, పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి, కార్పొరేట్లకు వంతపాడుతున్నారని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ఉంటేనే ప్రజలకు సరైన పాలన అందుతుందని మల్ రెడ్డి తెలిపారు.



## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి..

**దర్యాప్తు చేపట్టిన పోలీసులు..**

**రాజేంద్రనగర్ మహా ;** అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆర్జీఐఎ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఆర్జీఐఎ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోత్వాల్ గూడ ఈకో పార్కు సమీపంలో తపోస్ (32) అనే వ్యక్తి అనుమానస్పద స్థితిలో ముఖంపై గాయాలతో మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.తపోస్ అనే వ్యక్తి 13న పశ్చిమ్ బెంగాల్ నుంచి ఉపాధి కోసం శంషాబాద్ నగరంలోని కల్పతరు ప్రెస్టేజ్ సిటీలో కార్మికునిగా పని చేయడానికి వచ్చినట్లు తోటి కార్మికులు వెల్లడించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలి..!

- ధాన్యం దెబ్బతినకుండా నిల్వ సమర్థవంతంగా చేపట్టాలి
- సంబంధిత అధికారులకు ఆదేశాలు
- జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు, గోదాములకు త్వరితగతిన తరలించాలని, ధాన్యం దెబ్బతినకుండా నిల్వ ప్రక్రియ సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని, సంబంధిత రైస్ మిల్లర్లు, అధికారులు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూర్చుకోవాలని, రైస్ మిల్లుల యజమానులు ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని, గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన గన్ని బ్యాగులను, టార్పలిన్ లను అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కాంటా వేసి మిల్లులకు తరలించే చర్యలు చేపట్టాలన్నారు. రైతులు తమ పంటను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాల పరిశీలనలో పారదర్శకత పాటించాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్

**కంది శ్రీనివాస రెడ్డి**



**ఆదిలాబాద్ మహా :** నియోజక వర్గ ప్రజలకు ఎప్పుడు ఏ అవరమొచ్చినా తాను అండగా ఉంటానని వారి సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం లో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కు ఆయన తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి తో కలిసి హాజరయ్యారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలనుండి తరలివచ్చిన ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాదర్బార్ లో తమ సొంత సమస్యలు , గ్రామ సమస్యలు, వార్డు, కాలనీల సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. తమ సమస్యల పై దరఖాస్తులు సమర్పించారు. ప్రజాదర్బార్ లో ఏర్పాటు చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అప్లికేషన్ల డాటాను ఎప్పటికప్పుడు భద్రపరిచి క్లీయరెన్స్ అప్డేట్ తెలుసుకునే అవకాశముందన్నారు.ఆయా సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ పరిష్కారం కోసం శాయ శక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో అందించవచ్చన్నారు. వాటి పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీయం ఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** పేద బడుగు బలహీన వర్గాల సంక్షేం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధినుండి వచ్చిన చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణం లోని ఆయన క్యాంప్ కార్యాలయం ప్రజా సేవ భవనంలో సయ్యద్ బాబర్ కు 20వేల రూపాయల సీయంఆర్ఎఫ్ చెక్కును అందించారు. సీయంఆర్ ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్న వారికి ముఖ్య మంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీయం సభ ను విజయవంతం చేయండి

**కంది శ్రీనివాస రెడ్డి**



**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ కు రానున్నారని భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని ఇక్కడ నుండే మొదలు పెడతారని అన్నారు. ఆయనతో పాటు గృహనిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి , జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఇతర మంత్రులు హాజరు కానున్నారని తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు ఈ బహిరంగ జభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈసీఐఎల్ పీఎఫ్ ట్రస్ట్ లో రూ.41 లక్షల మోసం


**ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి రిమాండ్.. బంగారం స్వాధీనం**



**కుషాయిగూడ, మహా :** ఈసీఐఎల్ పీఎఫ్ ట్రస్ట్ ఖాతాల నుంచి చెక్కులు దొంగిలించి నకిలీ సంతకాలతో రూ.41 లక్షలకు పైగా మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించి చర్లపల్లి జైలుకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈసీఐఎల్ ఉద్యోగి ఏ. సంతోష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీఎఫ్ ట్రస్ట్ ఖాతాల బ్యాంక్ స్టేట్‌మెంట్లు పరిశీలించగా మోసం జరిగినట్లు గుర్తించారు. ఎస్బీఐ ఈసీఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎస్‌రావునగర్ శాఖలలోని ఖాతాల నుంచి మూడు చెక్కుల ద్వారా రూ.16 లక్షలు, రూ.12.50 లక్షలు, రూ.12.50 లక్షలు డ్రా అయినట్లు తేలింది. విచారణలో ఈ మొత్తాలు ఈసీఐఎల్ పీఎఫ్ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న రాజారపు ఓంకార్, అతని భార్య కాశీశ్వరి ఖాతాల్లో జమ అయినట్లు గుర్తించారు. చెక్కులు దొంగిలించి అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి నగదు బదిలీ చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. అంతర్గత విచారణలో చెక్‌బుక్‌లో నాలుగు చెక్కులు గల్లంతైనట్లు తెలిసింది. అందులో మూడు చెక్కులు నగదుపరచగా, మరో చెక్కు సంతకాల పొంతన లేక బ్యాంక్ తిరస్కరించింది. మోసంతో వచ్చిన డబ్బును ఇతర ఖాతాలకు బదిలీ చేసినట్లు విచారణలో బయటపడింది. ఈ మేరకు కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రెండు తులాల బంగారం స్వాధీనం చేసుకోగా, బ్యాంక్ ఖాతాల్లోని రూ.2.50 లక్షలను ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు.

## నూతన మండలాధ్యక్షులకు కంది శ్రీనివాస రెడ్డి సత్కారం






**ఆదిలాబాద్ మహా :** జైనథ్, భోరజ్, బేల మండలాల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా గడ్డం జగదీశ్వర్ రెడ్డి ,బత్తుల శ్రీనివాస్, రూప్ రావు లు నియమితులు కావడం సంతోషంగా ఉందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో వారిని ఘనంగా సత్కరించారు. ఎన్నోఏళ్లుగా వారు ఆయా మండలాలలో పార్టీ కోసం కష్టపడుతున్నారన్నారు. వారి కష్టానికి తగిన గుర్తింపు లభించిందన్నారు. అంతా కలిసి కట్టుగా పని చేసి పార్టీని మరింత బలోపేతంగా తయారు చేస్తామన్నారు.వచ్చే ఎన్నికలేవైనా గెలుపే లక్ష్యంగా ముందడుగు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు కార్యకర్తలతో పాటు పట్టణ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో చేరికలు





**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నాయకురాలు కావేటి జ్యోతి ఆధ్వర్యంలో 49వ వార్డు భుక్తాపూర్ కు చెందిన కాలనీ వాసులు బీజేపీ, బీఆర్ఎస్ నుండి శుక్రవారం కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరారు. అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి వారందరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. అందుకే ఇతర పార్టీల నుండి ఆకర్షితులై తమ పార్టీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో మరోమారు రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి గా చూడడం అలాగే రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే నాయకులు కార్యకర్తలుగా తమ లక్ష్యమన్నారు. అందరూ పార్టీ విజయం కోసం కష్ట పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

**మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ లోని భరద్వాజ్ కాలనీలో కొన్నిచోట్ల త్రాగునీటి సమస్య ఏర్పడినందున, కాలనీ కోర్ కమిటీ సభ్యులు ఆ సమస్యలను మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్ గారి దృష్టికి తీసుకెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించి వెంటనే మిషన్ భగీరథ పైపులు పంపించి పనులను ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గౌరవ మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్ , 15వ వార్డు కౌన్సిలర్ అప్పల సంధ్య సురేష్ యాదవ్ మరియు బాబు, కె. రమేష్, సిద్దు, రాజేష్ గౌడ్ మరియు కాలనీవాసులు ప్రెసిడెంట్ మల్లేష్ గౌడ్,వైస్ ప్రెసిడెంట్ సలీం భాయ్,ప్రధాన కార్యదర్శి బి. కుమార్,నరేష్ యాదవ్, జహంగీర్, నర్సింములు, బాలకృష్ణ, జైపాల్ రెడ్డి, రఘు, బాల్ రెడ్డి,మీనయ్య,ఆనంద్, శ్రీశైలం, చంద్రమౌళి, రవి రాజ్,బిస్వాల్, ఖాలిల్, జై రామ్ రెడ్డి,ఆంజనేయులు, కురుమూర్తి, వీరేందర్ నరసింహారెడ్డి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందవద్దు



**కంది శ్రీనివాస రెడ్డి**

**ఆదిలాబాద్ మహా:** ఆఖరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి తో కలిసి క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.జొన్న రైతులెవరు ఆందోళన చెందవద్దని అన్నారు. రైతుల విషయాన్ని తాను సీయం రేవంత్ రెడ్డి , వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఎన్‌టీఏ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలి

**టీవీయూవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్**

**మంచిర్యాల, మహా :** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారానికి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టీవీయువి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో టీవీయూవీ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు 2 సంవత్సరాల పాటు డబ్బులు, సమయం వెచ్చించి శిక్షణ తీసుకొని పరీక్షలు రాస్తే అది కాస్త రద్దు కావడం పట్ల ఆయన విచారణ వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు తల్లడిల్లుతున్నారని చెప్పారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఈ ఘటనకు కేంద్ర విద్యాశాఖతో పాటు సంబంధిత మంత్రి పూర్తి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాలతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతిష్ట దెబ్బతిందని, విద్యార్థుల్లో నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా అత్యంత భద్రతతో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పుకునే ఎన్‌టీఏ ద్వారా నిర్వహించిన పరీక్షపై ఇలాంటి వివాదాలు రావడం సిగ్గుచేటు అని అన్నారు. డాక్టర్లు కావాలనే లక్ష్యంతో కోచింగ్ సెంటర్లకు వెళ్లి శ్రద్ధగా చదివి పరీక్షలు రాసిన విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారని వివరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారని చెప్పారు.విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మళ్లీ నమ్మకం కలిగించేలా ఎన్‌టీఏ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని, పరీక్షల నిర్వహణలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోక్యం చేసుకుని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రంజిత్, తరుణ్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను అరెస్టు చేయడం హేయమైన చర్య

**సంగిశెట్టి క్రిస్టఫర్, మలిదశ ఉద్యమకారుడు**

**వలిగొండ, మహా :** ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కాలయాపన పేరుతో ఉద్యమ కారులను మోసం చేయాలనుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడి కార్యక్రమం పేరుతో కొన్ని ఉద్యమసంఘాలు పిలుపునివ్వడంతో ప్రభుత్వం పోలీసులు ఉద్యమకారుల హక్కుల కోసం కొట్లాడుతున్న వివిధ సంఘాల ఉద్యమకారులను శుక్రవారం అర్ధరాత్రి నుండే అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని మలిదశ ఉద్యమకారుడు టియుజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ ఆరోపించారు ఇవాళ మీరు పదవులు అనుభవిస్తున్నారంటే అది ఉద్యమకారుల త్యాగాల ఫలితమే అని గుర్తించాలని అన్నారు అనేకమంది ఉద్యమకారులు రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటాలు చేసి జైలు నిర్బంధాలను ఎదుర్కొని కోర్టుల చుట్టూ తిరిగి ఆర్థికంగా చితికిపోయి రోజుకు ఒక ఉద్యమకారుడు పిట్టలు రాలినట్లు రాలిపోతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాలయాపన చేయడం మూర్ఖత్వమని ఆయన హెచ్చరించారు జూన్ 2 నాడు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన ప్రకటన రాకపోతే ఈ ప్రభుత్వానికి ఉద్యమకారులు సరైన గుణపాఠం చెప్తారని ఆయన అన్నారు

## ధాన్యం కొనుగోళ్లలో లోడింగ్ జాప్యం జరుగకుండా చూడాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**యాదాద్రి భువనగిరి, మహా:** జిల్లాలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ,లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.శుక్రవారం పోచంపల్లి మండలం జాలూరు గ్రామంలోని పి.ఏ.సి.ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులను, నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ధాన్యం కొనుగోలు ప్రారంభించి ఎన్ని రోజులు అయ్యిందని, ఇప్పటి వరకు ఎంత మేర ధాన్యం కొనుగోలు చేశారని కలెక్టర్ అడిగితెలుసుకున్నారు.ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో ఎంత ధాన్యం నిల్వ ఉన్నాయని ఆరా తీశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా కొనుగోళ్లు కొనసాగించాలని సూచించారు. రోజుకు ఎన్ని లారీల ధాన్యం లోడింగ్ చేసి పంపుతున్నారని అడిగి తెలుసుకున్నారు.లారీలు సరిపడా ఉన్నాయా అని ఆరా తీశారు. లారీలు తక్కువగా రావడం వల్ల కాంటా ప్రక్రియలో ఏమైనా ఆలస్యం జరుగుతుందా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొచ్చిన తర్వాత ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈరోజు నుంచే ప్రతిరోజూ కనీసం 8 నుంచి 10 లారీలు లోడ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**మంచిర్యాల, మహా :** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం లో భాగంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహణలో భాగంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా జూన్ 15 నుండి 24 వరకు సన్నాహక, శిక్షణ, ముద్రణ కార్యక్రమాలు, జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సందర్శన ఉంటుందని వెల్లడించారు. అలాగే జూలై 24 నాడు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, 31 నాడు ముసాయిదా జాబితా ప్రచురణ నిర్వహించడం జరుగుతుందని వివరించారు. జూలై 31 నాటి నుండి ఆగస్టు 30 వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 28 వరకు ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారం ప్రక్రియ తరువాత అక్టోబర్ 1 నాడు తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజల సౌకర్యం కొరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.కార్యాలయం పని దినాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజలకు మరేమైనా సందేహాలు, సమాచారం కావలిస్తే కంట్రోల్ రూమ్ నం.08736250501 లో సంప్రదించాలని తెలిపారు.

## జనగణ సర్వేను పరిశీలించిన. హైదరాబాద్ కమిషనర్.ఆర్ వి కర్ణన్.



**రాజేంద్రనగర్, మహా ;** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్ వి కర్ణన్, జోనల్ కమిషనర్ చంద్రకళ, డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు తో కలిసి శంషాబాద్ సర్కిల్ 18 పరిధిలోని 118వ డివిజన్‌లో నిర్వహిస్తున్న జనగణన ఎన్యూమరేషన్ సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణ, డేటా సేకరణ విధానం, ఫీల్డ్ సిబ్బంది పని తీరును సమీక్షించారు.అధికారులు సర్వే ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితంగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రజలు జనగణన సర్వేకు పూర్తి సహకారం అందించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి సిబ్బంది బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన ఇంధన... ధరలను వెంటనే రద్దు చేయండి

- అంధకార స్థితిలోకి ప్రజలను నెట్టివేయడం ప్రభుత్వాలకు తగదు.
- ఐఎఫ్టియు జాతీయ కార్యదర్శి షేక్షావలి డిమాండ్



**కుషాయిగూడ, మహా :** పెంచిన ఇంధన ధరలను వెంటనే రద్దు చేయాలని అంధకార స్థితిలోకి ప్రజలను నెట్టివేయడం ప్రభుత్వాలకు తగదని ఐఎఫ్టియు జాతీయ కార్యదర్శి షేక్షావలి డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన పెట్రో పెంపు ధరలను వెంటనే రద్దు చేయాలని ఐఎఫ్టియు జాతీయ కార్యదర్శి షేక్షావలి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ 147 కోట్ల మంది భారత దేశ ప్రజలను అంధకారంలోకి నెట్టివేసే పెట్రోల్ డీజిల్ ధరల పెంపు దుర్మార్గమైన ప్రజా వ్యతిరేకమైన చర్య అని తెలిపారు. పాశ్చాత్య దేశాలలో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో ఏర్పడిన సంక్షోభం వలన ఆయిల్ కంపెనీలు చేపట్టిన నిర్ణయంలో భాగమే పెట్రోల్ ధరల పెంపు అని కేంద్ర ప్రభుత్వం అనడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ స్థాయిలో ఆయిల్ చమురు సంక్షోభంలో పడడానికి అమెరికా డోనాల్డ్ ట్రంప్ ఇజ్రాయిల్ నేతన్య లు కారణమని, ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిన వెంటనే ఇలాంటి అప్రజాస్వామ్యక చర్యల విధానాలతో దేశ ప్రజలను ఇంకా త్యాగాలకు సిద్ధపడాలని చెప్పడం శోచనియమన్నారు. ఇప్పటికే ఏఐ టెక్నాలజీ వలన అనేక సాఫ్ట్వేర్ కంపెనీలలో పని చేస్తున్న ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నారని ఇంకా కొందరి ఉద్యోగస్తులకు వారి ఉద్యోగ భద్రత గాలిలో దీపంలా ఊగిసలాడుతుందని అన్నారు. ఆత్మహత్యలు అర్ధాకలి పస్తులు చాలీచాలని విద్య ఉద్యోగం ఉపాధి సౌకర్యాలు వేతనాలు లేక తల్లడిల్లిపోతున్న ప్రజానీకంపై పెట్రోల్ పెంపు మోయలేని పెను భారం అన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యవసరలతోపాటు ప్రజలు అల్లాడిపోతున్నారని దీనికి తోడు పెట్రో ధరలతో ఇతర వస్తువుల ధరలు అమాంతం పెరిగి ప్రజల కొనుగోలు శక్తిని దెబ్బతీస్తాయని గుర్తు చేశారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని కోరారు.





## ఏడాదైనా నిండని కూతురు గురించి

# బోల్డ్ కామెంట్స్

భరత్ అనే నేను, గేమ్ ఛేంజర్ లాంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమున్న హీరోయిన్ కియారా అద్వాణీ.. త్వరలోనే 'టాక్సిక్'తో రాబోతుంది. ప్రస్తుతం గ్లామరస్ ఫొటోషూట్స్ చేస్తూ దర్శకనిర్మాతలని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్న ఈమె.. ఇప్పుడు ఏడాది కూడా నిండని తన కూతురి భవిష్యత్ గురించి షాకింగ్ కామెంట్స్ చేసింది. వాటిపై ఇప్పుడు సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కియారా అద్వాణీ.. కూతురు గురించి సంచలన వ్యాఖ్యలు చేసింది. 'ఆమె (సరయూ) పూర్తి జీవితం చూడాలని అనుకుంటున్నాను. ఒక్కరితో డేటింగ్ చేయాలని రూలేం లేదు. ఈ విషయంలో ఆమెకు ఎలాంటి ఆంక్షలు విధించను. పెళ్లి చేసుకోవాలనుకుంటే ఓకే లేదంటే లేదు. డేట్ చేసిన ప్రతి ఒక్కరినీ పెళ్లి చేసుకోవాలని లేదు. నాకు అలానే జరిగింది. చివరకు సరైన వ్యక్తి దొరికాడు. ఎదిగే క్రమంలో ఈ బంధాలు.. అన్ని పాఠాలు నేర్పిస్తాయి. మనల్ని మనిషిగా మారుస్తాయి. జీవితాన్ని పూర్తిగా అనుభవించాలి. పొరపాట్లు అందరూ చేస్తారు. కానీ వాటి నుంచే నేర్చుకుంటారు' అని కియారా స్టేట్‌మెంట్ ఇచ్చింది. కియారా చేసిన వ్యాఖ్యలపై ఇప్పుడు తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కనీసం ఏడాది పూర్తి కాని కూతురి గురించి మాట్లాల్సిన మాటలేనా ఇవి అని పలువురు నెటిజన్లు మండిపడుతున్నారు. ఇదేం ఫెమినిజం అని ప్రశ్నిస్తున్నారు. ఇదే సంస్కృతి అని ఫైర్ అవుతున్నారు. కియారా మాట్లాడిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాని కియారా ప్రేమించి 2023లో పెళ్లి చేసుకుంది. గతేడాది జూలైలో వీళ్లకు కూతురు పుట్టింది.

## పెద్ది ప్రమోషన్స్ కు

# దూరంగా హీరోయిన్..

ప్రస్తుతం టాలీవుడ్‌లో అందరి చూపులు పెద్ది సినిమా వైపే ఉన్నట్లు కనిపిస్తోంది. రామ్ చరణ్ హీరోగా వస్తోన్న ఈ చిత్రం జూన్ 4న థియేటర్లలో సందడి చేసేందుకు వచ్చేస్తోంది. ఈ నేపథ్యంలోనే మేకర్స్ ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీ అయిపోయారు. ఈ నెల 18న పెద్ది ట్రైలర్ రిలీజ్ చేస్తామని ఇప్పటికే ప్రకటించారు. డైరెక్టర్ బుచ్చిబాబు సనా సైతం పెద్ది ప్రమోషన్స్‌లో ఫుల్ యాక్టివ్‌గా పాల్గొంటున్నారు. అంతేకాకుండా ట్రైలర్ కోసం మెగా ఫ్యాన్స్ సైతం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ఈ నేపథ్యంలోనే పెద్ది మూవీ గురించి మరో చర్చ మొదలైంది. ఈ సినిమా హీరోయిన్ జాన్వీ కపూర్ ఎక్కడా కనిపించకపోవడంతో ఫ్యాన్స్ ఫీలవుతున్నారు. మూవీ ప్రమోషన్స్ వీడియోల్లోనూ జాన్వీ పెద్దగా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో జాన్వీ పెద్ది ప్రమోషన్స్‌కు దూరంగా ఉండడంపై టాలీవుడ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.

### కారణం అదేనా??

అయితే జాన్వీ కపూర్ కేవలం భారీ రెమ్యూనరేషన్ కోసమే ఈ ప్రాజెక్టుకు సంతకం చేసిందని ఓ టాక్ వినిపిస్తోంది. అంతేకాకుండా సినిమాలో తన పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం వల్లే ప్రమోషన్లకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుందని ఓ కథనంలో వెల్లడైంది.ఈ విషయంపై చిత్ర యూనిట్ నుంచి ఇంకా ఎలాంటి క్లారిటీ రాలేదు. అయితే ట్రైలర్ రిలీజ్‌కు వేడుకలోనైనా జాన్వీ కపూర్ కనిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే ముంబయిలో ట్రైలర్ రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. అయితే ఒకవేళ ప్రమోషన్ల విషయంలో జాన్వీ వెనక్కి తగ్గితే అది ఆమె కెరీర్‌పై ప్రభావం చూపే ఛాన్స్ ఉంది. ఎందుకంటే 'పెద్ది' లాంటి పాన్ ఇండియా చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చే అవకాశాన్ని బాలీవుడ్ బ్యూటీ మిస్ చేసుకున్నట్లే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com